స్కాన్ చేయండి

www.vaarthavedhikasurya.com

PRGI NO:- TGTEL/25/A0305

# వార్త వేదిక సూర్య

తెలుగు దినపత్రిక

VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY

| యాదాద్రి భువనగిరి | సంపుటి: 2 | సంచిక: 93 | శుక్రవారం, 21 ఆగస్టు, 2026 | ఎడిటర్: పోలోజు శ్రీనివాసచారి | పేజీలు: 8 | వెల: 5-00 |
|---|---|---|---|---|---|---|
| YADADRI BHUVANAGIRI | VOLUME : 2 | ISSUE : 93 | FRIDAY, AUGUST 10, 2026 | EDITOR : POLOJU SRINIVASA CHARY | PAGES : 8 | RS : 5-00 |


## క్రమశిక్షణా కమిటీకి మంత్రి సురేఖ వివరణ

కుమార్తె వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిని చేయడం సముచితం కాదు..

నోటీసును ఉపసంహరించుకోవాలని టీపీసీసీ క్రమశిక్షణా కమిటీకి విజ్ఞప్తి

2 లో..

## సమస్యల పరిష్కారమే అసలైన సమాఖ్యవాదం

- దక్షిణాది అభివృద్ధి చెందితేనే.. దేశాభివృద్ధి పరుగులు
- కాళేశ్వరం, పాలమరు'రంగారెడ్డి ఎత్తిపోతలకు చేయత
- పథకాలకు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలి
- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

మహాబలిపురం, (వార్త వేదిక సూర్య):



కేంద్ర,రాష్ట్రాల మధ్య ఉన్న సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరించడంతో పాటు తీసుకున్న నిర్ణయాలను వేగంగా అమలు చేయడమే సహకార సమాఖ్యవాద స్ఫూర్తి అని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. భిన్నమైన ప్రయోజనాలు ఎదురైనప్పుడు కూడా న్యాయబద్ధమైన పరిష్కారాన్ని కనుగొనగలగడమే సమాఖ్య వ్యవస్థకు అసలైన పరీక్ష అని ఆయన పేర్కొన్నారు. మహాబలిపురంలో జరిగిన 31వ దక్షిణ ప్రాంతీయ మండలి సమావేశంలో ఆయన తెలంగాణ వైఖరిని స్పష్టంగా వెల్లడించారు. కేంద్ర హోం శాఖ మంత్రి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటుగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కర్నాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్, కేరళం ముఖ్యమంత్రి వీడీ సతీషన్, తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ ఇతర కీలక నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. మహాబలిపురంలోని చారిత్రక కట్టడాలను ప్రస్తావించారు. బలమైన నిర్మాణానికి ప్రతి భాగం ఒకేలా ఉండాల్సిన అవసరం లేదని, ప్రతి భాగం తన వంతు భారాన్ని మోయాల్సి ఉంటుందని అన్నారు. భారత సమాఖ్య వ్యవస్థ కూడా ఇదే స్ఫూర్తితో పనిచేయాలని పేర్కొన్నారు. భిన్నమైన ప్రయోజనాలను న్యాయబద్ధంగా, చట్టబద్ధంగా, సమర్థవంతంగా సమన్వయం చేయగల మిగతా 2లో..

# దక్షిణాది ప్రగతికి కలిసి కదులుదాం

- రాష్ట్రాల మధ్య సహకారంతోనే వికసిత్ భారత్ సాకారం: చంద్రబాబు
- దేశ స్థూల ఉత్పత్తిలో 5 దక్షిణ రాష్ట్రాల వాటా 31శాతం
- 2047కి 10 ట్రిలియన్ డాలర్ల శక్తిగా సౌతిండియా
- గోదావరి-కావేరి సంధానంతో 500 టీఎంసీల వరద
- సద్వినియోగం.. ఉమ్మడి లాజిస్టిక్స్, డ్రైపోర్టుల నెట్‌వర్క్
- ఏపీ, తమిళనాడు, కర్ణాటక నడుమ బుల్లెట్ రైలు
- జాతీయ విద్యుత్ గ్రిడ్‌తో సదరన్ గ్రిడ్ అనుసంధానం
- తిరుపతి టు అయోధ్య.. తీర్థయాత్ర సర్క్యూట్
- సదరన్ కౌన్సిల్ భేటీలో సీఎం ప్రతిపాదనలు

అమరావతి, (వార్త వేదిక సూర్య):



రాష్ట్రాల మధ్య ఉన్న సమస్యలను పరస్పర సహకారం, సమన్వయంతో పరిష్కరించుకోవాలని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపిచ్చారు. దక్షిణాది రాష్ట్రాలు కలిసికట్టుగా ముందుకు సాగితే దేశాభివృద్ధికి మరింత బలమైన చోదక శక్తిగా నిలుస్తాయన్నారు. 2047 నాటికి దక్షిణ భారతదేశానికి 10 ట్రిలియన్ డాలర్లకు పైగా ఆర్థిక వ్యవస్థగా ఎదిగే సామర్థ్యం ఉందని తెలిపారు. తమిళనాడులోని మహాబలిపురంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా అధ్యక్షతన జరిగిన 31వ సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశంలో 24 అంశాలపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా చంద్రబాబు ప్రసంగించారు. దక్షిణ రాష్ట్రాల మధ్య పరస్పర సహకారం సాధించడమే తమ లక్ష్యమన్నారు. కేంద్ర రాష్ట్రాల మధ్య విశ్వాసం, పరస్పర సహకారంతో సమస్యల పరిష్కారం జరగాలని సూచించారు. ఈ సందర్భంగా పలు కీలక ప్రతిపాదనలు చేశారు. ఏపీ తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలను కలుపుతూ కుప్పం మీదుగా బుల్లెట్ రైలు కారిడార్‌ను అభివృద్ధి చేయాలని ప్రతిపాదించారు. అమరావతి, బెంగళూరు, చెన్నై నగరాలను అనుసంధానించే ఈ మార్గం మూడు రాష్ట్రాల ఆర్థిక కార్యకలాపాలకు మరింత ఊతమిస్తుందన్నారు. ఏపీ 2.4 ట్రిలియన్ డాలర్లు, తమిళనాడు 2.6, కర్ణాటక 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థలుగా లక్ష్యాలు నిర్దేశించుకున్నాయని.. సమష్టిగా దక్షిణ భారత రాష్ట్రాలన్నీ 10 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా ఎదుగుతాయని వివరించారు. కేంద్ర-రాష్ట్ర సంబంధాల్లో పరస్పర విశ్వాసం, రాష్ట్రాల మధ్య సహకారం, సమష్టి అభివృద్ధి ప్రధాన లక్ష్యాలుగా సదరన్ కౌన్సిల్ పనిచేయాన్నారు. ఇక్కడ తీసుకున్న నిర్ణయాలు త్వరితగతిన అమలు అయ్యేలా చూడాలని కోరారు. చంద్రబాబు ఇంకా ఏమన్నారంటే..

### సమీకృత ఉత్పత్తి, ఎగుమతి కేంద్రంగా..

'దక్షిణాది రాష్ట్రాలకు ఉమ్మడి లాజిస్టిక్స్ వ్యవస్థ, డ్రై పోర్టుల నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయాలి. ఇది దక్షిణ మిగతా 2లో..

## '22ఏ'పై ప్రతి ఫిర్యాదుకు పరిష్కారం

- కాల్ సెంటర్‌కు వచ్చిన ఫిర్యాదు పరిష్కారమే లక్ష్యం
- ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండకూడదు
- అధికారులకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశం
- నేటి నుంచి జిల్లాల వారీగా రెవెన్యూ సమీక్షలు
- క్షేత్రస్థాయిలోనే సమస్యలకు పరిష్కారం చూపే లక్ష్యం
- నేడు జగిత్యాలలో.. రేపు నిజామాబాద్‌లో సమీక్ష: పొంగులేటి



హైదరాబాద్, (వార్త వేదిక సూర్య):

22ఏ నిషేధిత భూముల అంశంలో ప్రజలకు పూర్తి భరోసా కల్పించే దిశగా రెవెన్యూ శాఖ చర్యలను మరింత వేగవంతం చేసిందని కాల్ సెంటర్‌కు వచ్చే ప్రతి దరఖాస్తును కేవలం ఒక ఫిర్యాదుగా కాకుండా ఒక బాధ్యతగా తీసుకోవాలని, సమస్య పరిష్కారమయ్యే వరకు ప్రత్యేకంగా పర్యవేక్షించాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. విషయంలో ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి స్పష్టం చేశారు. నిజమైన హక్కుదారులకు ప్రభుత్వం మిగతా 2లో..

### రైతుల భూ భద్రత కోసమే భూ భారతి

- గతంలో బోగస్ పాస్ పుస్తకాలతో రైతుభరోసా స్వాహా
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడి

2 లో..

## రెవెన్యూ మంత్రి పొంగులేటిని బర్తరఫ్ చేయాలి

- 22ఏ దుర్వినియోగంపై రాహుల్‌కు మాజీ మంత్రి హరీశ్‌రావు బహిరంగ లేఖ
- 30 శాతం కమీషన్ల ఆరోపణలపై స్వతంత్ర విచారణ జరపాలి
- 2023 డిసెంబర్ నుంచి భూముల జాబితాపై ఫోరెన్సిక్ ఆడిట్ చేయాలని డిమాండ్



హైదరాబాద్, (వార్త వేదిక సూర్య):

తెలంగాణ రెవెన్యూ శాఖలో సెక్షన్ 22 ఏ దుర్వినియోగం, భూ వ్యవహారాల్లో అవినీతి ఆరోపణలపై బీఆర్ఎస్ మాజీ మంత్రి హరీశ్‌రావు లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి బహిరంగ లేఖ రాశారు. తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని తక్షణమే మంత్రివర్గం నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. సెక్షన్ 22ఏ నిబంధనలను నిషేధిత భూముల రిజిస్ట్రేషన్‌ను అడ్డుకునేందుకు ఉపయోగించాలి తప్ప, ప్రైవేటు ఆస్తులపై కృత్రిమ వివాదాలు సృష్టించి వసూళ్లకు పాల్పడేందుకు కాదని పేర్కొన్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాలతో పాటు జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ ప్రాంతాల్లో హెచ్‌ఎండీఏ అనుమతులు ఉన్న వేలాది ప్రైవేటు ఆస్తులను ఏకపక్షంగా 22ఏ జాబితాలో చేర్చి యజమానులను వేధిస్తున్నారంటూ హరీశ్‌రావు ఆరోపించారు. నిషేధిత జాబితా నుంచి భూములను తొలగించుకోవడానికి దళారులు మార్కెట్ విలువలో 30 శాతం వరకు కమీషన్లు డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. మిగతా 2లో..

## భద్రాచలం 5 గ్రామాల విలీనానికి తుమ్మల విజ్ఞప్తి



- ఆయిల్‌పామ్ గెలలకు రూ.25 వేల ధర..
- పెద్దవాగు పునరుద్ధరణకు ఏపీ వాటా నిధులు..
- భద్రాచలం–ఏలూరు రహదారికి జాతీయ హోదా కోరిన మంత్రి
- సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశం వేదికగా తెలంగాణ ప్రయోజనాలకు సంబంధించిన పలు కీలక అంశాలపై

హైదరాబాద్, (వార్త వేదిక సూర్య):

సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశం వేదికగా తెలంగాణ ప్రయోజనాలకు సంబంధించిన పలు కీలక అంశాలపై వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత–జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. కేంద్ర హోం, సహకార శాఖల మంత్రి అమిత్‌షా అధ్యక్షతన మహాబలిపురంలో జరిగిన 31వ సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు మంత్రి తుమ్మల, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర విభజన అనంతరం మిగతా 2లో..

## పంచాయతీరాజ్ సంస్థల్లో బీసీలకు 34శాతం

- సర్పంచ్ నుంచి జడ్పీ చైర్‌పర్సన్ వరకు రిజర్వేషన్
- పంచాయతీ సభ్యులు, ఎంపీటీసీ, ఎంపీపీ, జడ్పీటీసీ పదవులకూ వర్తింపు
- ఉత్తర్వులు జారీ

గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లను ప్రభుత్వం పునరుద్ధరించింది. గ్రామ పంచాయతీ సభ్యులు, సర్పంచ్‌లు, మండలపరిషత్ సభ్యులు, ఎంపీపీలు, జిల్లా పరిషత్ సభ్యులు, జడ్పీ చైర్‌పర్సన్ పదవులకు ఈ రిజర్వేషన్ వర్తించనుంది. గురువారం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి కాంతిలాల్ దండే ఆ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.




## ఫీజు బకాయిలు విడుదల చేసే వరకు రాజీలేని పోరాటం

- విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడితే రేవంత్ సర్కార్ మెడలు వంచుతాం
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు

హైదరాబాద్, (వార్త వేదిక సూర్య):

ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ యువమోర్చా ఆధ్వర్యంలో కరీంనగర్‌లో నిర్వహించిన "ఫీజు బకాయి–బీజేపీ లడాయి" మహాధర్నాలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. విద్యార్థుల ఫీజు బకాయిలు, మిగతా 2లో..

www.vaarthavedhikasurya.com వార్త వేదిక సూర్య తెలుగు దినపత్రిక VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY

సంపుటి:2 | సంచిక: 93 | శుక్రవారం 21 ఆగస్టు, 2026

## క్రమశిక్షణా కమిటీకి మంత్రి సురేఖ వివరణ

**కుమార్తె వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిని చేయడం సముచితం కాదు.. - నోటీసును ఉపసంహరించుకోవాలని టీపీసీసీ క్రమశిక్షణా కమిటీకి విజ్ఞప్తి**

హైదరాబాద్, (వార్త వేదిక సూర్య): టీపీసీసీ క్రమశిక్షణా కమిటీ జారీ చేసిన నోటీసుపై అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ గురువారం వివరణ ఇచ్చారు. తన వివరణతో కూడిన లేఖను క్రమశిక్షణా కమిటీ చైర్మన్ మల్లు రవికి పంపించారు. తన కుమార్తె కొండా సుస్మితా పటేల్ చేసిన వ్యాఖ్యలతో తనకు ఎలాంటి సంబంధం లేదని, వాటిని తన వ్యక్తిగత వ్యాఖ్యలుగా పరిగణించాలని లేఖలో స్పష్టం చేశారు. ఆగస్టు 19న తన జన్మదినోత్సవం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా 'కొండా' కుటుంబ అభిమానులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పలు ప్రాంతాల్లో వేడుకలు నిర్వహించడంతో పాటు సేవా కార్యక్రమాలు చేపట్టారని మంత్రి తెలిపారు. తన స్వస్థలమైన గీసుకొండతో తన కుమార్తె సుస్మితా పటేల్‌కు ఉన్న ప్రత్యేక అనుబంధం కారణంగా అక్కడ కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు నిర్వహిం చిన జన్మదిన వేడుకల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారని వివరించారు. ఆ కార్యక్రమంలో తన కుమార్తె చేసిన వ్యాఖ్యలు పూర్తిగా ఆమె వ్యక్తిగత అభిప్రాయాలని మంత్రి సురేఖ పేర్కొన్నారు. కుటుంబ బంధం ఉన్న కారణం గా ఒక వ్యక్తి చేసిన వ్యక్తిగత వ్యాఖ్యలకు మరో వ్యక్తిని రాజకీయంగా బాధ్యురాలిని చేయడం సముచితం కాదని స్పష్టం చేశారు. కుమార్తె వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిగా చేస్తూ వివరణ కోరడం సహజ న్యాయ స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకత్వం, పార్టీ క్రమశిక్షణా నియ మావళిపై తనకు సంపూర్ణ గౌరవం ఉందని మంత్రి సురేఖ స్పష్టం చేశారు. పార్టీ క్రమశిక్ష ణకు తాను ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటానని తెలిపారు. వాస్తవ పరిస్థితులను, ప్రజాస్వా మ్య విలువలను పరిగణనలోకి తీసుకుని ఈ వ్యవహారంలో తనకు ఎలాంటి ప్రమేయం లేదని గుర్తించాలని కోరారు. తన కుమార్తె చేసిన వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిగా చేయకుండా, తన వివరణను పరిగణనలోకి తీసుకుని తనకు జారీ చేసిన నోటీసును ఉపసంహరించుకోవాలని టీపీసీసీ క్రమశిక్షణా కమిటీ చైర్మన్ మల్లు రవికి మంత్రి కొండా సురేఖ విజ్ఞప్తి చేశారు.

## ఎల్‌నినోపై సమగ్ర కార్యాచరణ

**గ్రామాల్లో నీటి సంరక్షణ.. ఉపాధి కల్పనకు ప్రాధాన్యం వ్యవసాయం, ఉద్యానవనం, మత్స్య, పశుసంవర్ధక శాఖల సమన్వయంతో ప్రణాళిక.. రాజీవ్ గాంధీకి మంత్రి సీతక్క ఘన నివాళి**

హైదరాబాద్, (వార్త వేదిక సూర్య): ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో తలెత్తే వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సమగ్ర కార్యాచరణకు సిద్ధమవుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో నీటి సంరక్షణ, వ్యవసాయానికి నీటి భద్రత, ఉపాధి కల్పనకు ప్రాధాన్యం ఇస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం రాజేంద్రనగర్‌లోని టీజీఐఆర్డీలో ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. వీబీ–జీ రామ్‌జీ పథకం ద్వారా చేపట్టాల్సిన పనులు, సమగ్ర వ్యవసాయ చెరు వుల నిర్మాణం, గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక, వికసిత్ భారత్ గ్రామ ప్రణాళిక, వివిధ శాఖల సమన్వయంపై ఇందులో చర్చించనున్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే వర్క్‌షాప్‌లో ఎల్‌నినో పరిస్థితులను ముందుగానే అంచనా వేసి గ్రామస్థాయిలో చేపట్టాల్సిన చర్యలపై కార్యాచరణ రూపొం దించనున్నారు. వర్షాభావ పరిస్థితుల్లో వ్యవసాయానికి అవసరమైన నీటి లభ్యతను పెంచడం, నీటి వనరులను అభివృద్ధి చేయ డం, గ్రామీణ ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించడం, వ్యవసాయ ఉత్పాదకతను కాపాడటం ప్రధాన లక్ష్యాలుగా అధికారులు పేర్కొన్నారు. వీబీ–జీ రామ్‌జీ పథకం కింద గ్రామాల అవసరాలకు అనుగుణంగా పనులను గుర్తించి వేగంగా అమలు చేయడంపై ప్రత్యేకంగా దృష్టి సారించనున్నారు. సమగ్ర వ్యవసాయ చెరువుల నిర్మాణం ద్వారా వర్షపు నీటిని నిల్వ చేసి భూగర్భ జలాలను పెంచడంతో పాటు పంటలకు నీటి భద్రత కల్పించేలా ప్రణాళిక రూపొందించనున్నారు. వ్యవసాయం, ఉద్యానవనం, మత్స్య, పశు సంవర్ధక శాఖలు తమ పరిధిలో చేపట్టాల్సిన కార్యక్రమాలను సమన్వయంతో అమలు చేసే విధానంపై కూడా చర్చించనున్నారు. వర్క్‌షాప్‌కు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, వ్యవసా య శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పశుసంవర్ధక, మత్స్య శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజూ, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దానకిషోర్, ఆయా శాఖల కార్యదర్శులు, టీజీఐఆర్డీ సీఈఓతో పాటు ఉన్నతాధికారులు హాజరుకానున్నారు.

# దక్షిణాది ప్రగతికి కలిసి కదులుదాం

(మొదటి పేజీ తరువాయి)

భారతాన్ని సమీకృత ఉత్పత్తి, ఎగుమతి కేంద్రంగా మార్చగలదు. దక్షిణాది గ్రిడ్‌ను జాతీయ విద్యుత్ గ్రిడ్‌తో అనుసంధానించాలి. ఒక రాష్ట్రంలో మిగులు కరెంటు ఉంటే మరో రాష్ట్ర అవసరాన్ని తీర్చే విధంగా సమర్థ విద్యుత్ మార్పిడి వ్యవస్థ అవసరం. దక్షిణాది వర్సిటీలు, ఇతర స్కిల్లింగ్ సంస్థలతో కలిసి సంయుక్త నైపుణ్యాభివృద్ధి వ్యవస్థను ఏర్పాటు చేయాలి. ప్రకృతి విపత్తుల సమయంలో పరస్పర సహాయానికి ప్రత్యేక విపత్తు నిర్వహణ టాస్క్‌ఫోర్స్ (మ్యూచువల్ ఎయిడ్ ఫోర్స్)ను కేంద్రం ఏర్పాటు చేయాలి. దక్షిణాది ప్రముఖ పుణ్యక్షేత్రాలను ఉత్తర భారతంలోని ఆధ్యాత్మిక కేంద్రాలతో అనుసంధానిస్తూ ప్రత్యేక వారసత్వ, పర్యాటక, తీర్థయాత్ర సర్క్యూట్ ఏర్పాటు చేయాలి. తిరుపతి, శ్రీశైలం, కాంచీపురం, మధురై, రామేశ్వరం, మైసూరు వంటి ప్రాంతాలను వారణాసి, అయోధ్య, చార్‌ధామ్ ప్రాంతాలతో అనుసంధానిస్తే.. దేశవ్యాప్తంగా ఆధ్యాత్మిక పర్యాటకాన్ని ప్రోత్సహించవచ్చు.'

### గోదావరి-కావేరి అనుసంధానంతో నీటి భద్రత

'భవిష్యత్ నీటి భద్రతకు నదుల అనుసంధానమే శాశ్వత పరిష్కారం. ఏపీలో గోదావరి, కృష్ణా, వంశధార, నాగావళి, పెన్నా వంటి 40 నదులు 28 జిల్లాలకు సాగునీటిని అందిస్తున్నాయి. గోదావరి–కావేరి అనుసంధానంలో భాగంగా పోలవరం, కృష్ణా, పెన్నా మీదుగా 500 టీఎంసీలకుపైగా మిగులు వరదల జలాలను కావేరి బేసిన్‌కు తరలించాలి. ఈ ప్రాజెక్టుతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు ఎంతో ప్రయోజనం. గంగా–కావేరి అనుసంధానాన్ని జాతీయ ప్రాజెక్టుగా చేపట్టాలి. గంగా నది మిగులు జలాలను దక్షిణాదికి తరలించడం ద్వారా తమిళనాడుతోపాటు దక్షిణాది రాష్ట్రాల నీటి భద్రతకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది.'

# సమస్యల పరిష్కారమే అసలైన సమాఖ్యవాదం

(మొదటి పేజీ తరువాయి)

సంస్థలు ఉండటమే నిజమైన సమాఖ్యవాదమని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. పెట్టుబడులు, పరిశ్రమలు, ఉద్యోగాలు, ప్రతిభ కోసం రాష్ట్రాల మధ్య పోటీ సహజమేనని ఆయన చెప్పుకొచ్చారు. నదులు, విద్యుత్ గ్రిడ్లు, కార్మికులు, వ్యాపారాలకు రాష్ట్ర సరిహద్దులు అడ్డంకులు కావని డిప్యూటీ సీఎం చెప్పారు.సమస్యలు రాష్ట్ర సరిహద్దుల ను ప్రభుత్వాల్లె కంటే వేగంగా దాటుతాయి భట్టి చమత్కరించారు. ఈ పరస్పర ఆధారిత పరిస్థితుల నేపథ్యంలో దక్షిణ ప్రాంతీయ మండలి వంటి సంస్థల ప్రాధాన్యత మరింత పెరుగుతోందన్నారు. నిబంధనలు స్పష్టంగా ఉండడంతో పాటుగా అన్ని రాష్ట్రాలకు ఒకే నిబంధనలు వర్తించాలని తెలంగాణ కోరుకుంటోందని తెలిపారు. కృష్ణా జలాల విషయంలో తెలంగాణ చాలా స్పష్టంగా ఉందని చెప్పారు. ఇప్పటికే ఏర్పాటైన చట్టపరమైన వ్యవస్థల ప్రకారం రాష్ట్రానికి దక్కాల్సిన న్యాయమైన వాటాను తెలంగాణ కచ్చితంగా కోరుకుంటోందని చెప్పారు. దిగువ రాష్ట్రాల హక్కులకు భంగం కలిగించే ఏకపక్ష చర్యలను అడ్డుకోవాలని, కృష్ణా నదీ పరివాహక ప్రాంతంలోని అన్ని రాష్ట్రాలకు ఒకే సూత్రాలను వర్తింపజేయాలని ఆయన చెప్పారు. తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ మధ్య కృష్ణా జలాల కేటాయింపు అంశం ప్రస్తుతం కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్?ఎఎ పరిధిలో ఉందని ఆయన గుర్తు చేశారు. చట్టపరమైన ప్రక్రియ ద్వారా త్వరగా సమస్యకు పరిష్కారం కనుగొనాలని ఆయన చెప్పారు. మిగులు జలాలపై దిగువ రాష్ట్రంగా తెలంగాణకు ఉన్న హక్కులను దక్షిణాది రాష్ట్రాల ప్రాంతీయ మండలి సమావేశంలో భట్టి విక్రమార్క మరోసారి స్పష్టంగా చెప్పారు. పాలమురు? రంగారెడ్డి, నక్కలగండి ఎత్తిపోతల పథకాల విషయంలో తెలంగాణ ప్రయోజనాలను పరిరక్షించాలని చెప్పారు. కాళేశ్వరం, పాలమురు'రంగారెడ్డి ఎత్తిపోతల పథకాలకు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలని కోరారు. కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణ చర్యలు కొనసాగుతున్నాయని, తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత?చేవెళ్ల ప్రాజెక్టును పునరుద్ధరించే చర్యలు కూడా ముందుకు సాగుతున్నాయని చెప్పారు. పాలమురు?రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో మిగిలిన పనులను పూర్తి చేసి ప్రాజెక్టును పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకురావడానికి కేంద్రం సహకరించాలన్నారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం'2014 అమల్లోకి వచ్చి 12 ఏళ్లు గడిచినా రెండు తెలుగు రాష్ట్రాల మధ్య అనేక అంశాలు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. చట్టంలోని నిబంధనలకు అనుగుణంగా ఈ సమస్యలకు తుది పరిష్కారం చూపాల్సిన అవసరం ఉందని ఆయన చెప్పారు. పరిష్కారం అంటే అంతులేని ఉత్తర ప్రత్యుత్తరాలు కొనసాగించడం కాదని, ప్రతి కొన్ని సంవత్సరాలకు కొత్త అర్థాలు, వివరణలు ఇవ్వడం కూడా కాదని ఆయన వ్యాఖ్యానించారు. పెండింగ్ అంశాలు ఇకపై తుది నిర్ణయాలు, సమర్థవంతమైన అమలు దిశగా సాగాలని తెలంగాణ కోరుకుంటోందని అన్నారు. షెడ్యూల్‌లోని ప్రభుత్వ సంస్థలు, కార్పొరేషన్ల విభజనకు సంబంధించి 23 సంస్థలపై తెలంగాణ తన అభిప్రాయాలను ఇప్పటికే కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు సమర్పించిందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం?2014కు సంబంధించి సమస్యల పరిష్కారానికి తెలంగాణ సిద్ధంగా ఉందని తెలిపింది. సమస్యలు త్వరితగతిన పరిష్కారం కావాలని కోరుకుంటున్నప్పటికీ, అది తప్పనిసరిగా చట్టపరమైన వ్యవస్థ పరిధిలోనే ఉండాలని స్పష్టంగా చెప్పారు. షెడ్యూల్?చీ సంస్థలకు సంబంధించిన ఆస్తుల విభజనను ఆంధ్రప్రదేశ్ కోరుతోందని, అయితే పునర్వ్యవస్థీకరణ చట్టంలో అందుకు స్పష్టమైన ఆధారం లేదని ఆయన చెప్పారు. సెక్షన్ 75 కింద సౌకర్యాల కొనసాగింపునకు సంబంధించిన అంశాలు మినహా ఎలాంటి ఆస్తుల విభజనకు చట్టపరమైన మద్దతు లేదని తెలిపారు. ఈ అంశం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు పరిధిలో కూడా పెండింగ్‌లో ఉన్నందున, చట్టంలోని నిబంధనలకు అనుగుణంగా న్యాయపరమైన ప్రక్రియ ద్వారానే పరిష్కారం కనుగొనాలని కోరారు. నీటి భద్రత, ఇంధన భద్రత, వాతావరణ మార్పులు, పట్టణీకరణ, రవాణా?లాజిస్టిక్స్, ఆర్థిక పోటీతత్వం వంటి అంశాలు రాబోయే రోజుల్లో దక్షిణాది రాష్ట్రాలకు కీలక సవాళ్లుగా మారనున్నాయని అన్నారు. ఈ సవాళ్లను ఎదుర్కొనేందుకు రాష్ట్రాలు పోటీ పడుతూనే పరస్పరం సహకరించుకోవాల్సి ఉంటుందని చెప్పారు. దక్షిణ భారతదేశం కలిసి అభివృద్ధి చెందితే, భారతదేశం మరింత వేగంగా అభివృద్ధి చెందుతుందని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. తదుపరి 32వ దక్షిణ ప్రాంతీయ మండలి సమావేశాన్ని హైదరాబాద్‌లో నిర్వహించేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. దక్షిణాది రాష్ట్రాల మధ్య సమస్యలకు చర్చల ద్వారా శాశ్వత పరిష్కారాలు కనుగొనాలని ఆకాంక్షించారు. ట్రిబ్యునల్ లేకుండా, కమిటీ లేకుండా, బహుశా మరోసారి ఉత్తర ప్రత్యుత్తరాలు కూడా లేకుండా సమస్యలు పరిష్కారం కావాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశానికి హాజరయ్యే అన్ని రాష్ట్రాలకు తెలంగాణ ఆత్మీయ ఆతిథ్యం అందిస్తుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు.

# ఫీజు బకాయిలు విడుదల చేసే వరకు రాజీలేని పోరాటం

(మొదటి పేజీ తరువాయి)

స్కాలర్‌షిప్‌లు విడుదల చేసే వరకు కాంగ్రెస్ ప్రభుత్వంపై రాజీలేని పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. సంక్షేమ రాజ్యం తీసుకొస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నేడు విద్యార్థుల సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. గత ప్రభుత్వం సుమారు రూ.8 వేల కోట్ల ఫీజు బకాయిలు పెడితే, ప్రస్తుత ప్రభుత్వం కూడా నిధులు విడుదల చేయకుండా నిర్లక్ష్యం చేస్తోందని రాంచందర్‌రావు విమర్శించారు. హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో రూ.2 వేల కోట్లు ముందస్తుగా విడుదల చేస్తామని కేబినెట్‌లో నిర్ణయించినప్పటికీ ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 20 లక్షల మంది విద్యార్థులు ఫీజు బకాయిల కోసం ఎదురుచూస్తున్నారని, కళాశాలలకు నిధులు అందక అధ్యాపకులకు జీతాలు చెల్లించలేని పరిస్థితి నెలకొందని అన్నారు. దీంతో విద్యాసంస్థలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. ఫీజులు చెల్లించలేక విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆర్థిక, మానసిక ఒత్తిడికి గురవుతున్నారని రాంచందర్‌రావు పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా విద్యార్థుల భవిష్యత్తును విస్మరిస్తోందని విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే విద్యార్థుల పక్షాన ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు గణేష్ కుందే మాట్లాడుతూ విద్యార్థుల హక్కుల సాధన కోసం గత నెల రోజులుగా బీజేవైఎం ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో ఆందోళనలు నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థుల సమస్యలపై పోరాడుతున్న వారిని అడ్డుకునేందుకు పోలీసులు నోటీసులు జారీ చేయడం సరికాదన్నారు. విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేకపోతే కలెక్టరేట్ల ముట్టడి సహా ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఫీజు బకాయిలు, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయకపోతే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మహాధర్నాలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శాంతికుమార్, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు గణేష్ కుందే, జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం, నగర మేయర్ శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్‌రావు, మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభతో పాటు వేలాది మంది విద్యార్థులు, యువకులు పాల్గొన్నారు.

# '22ఏ'పై ప్రతి ఫిర్యాదుకు పరిష్కారం

(మొదటి పేజీ తరువాయి)

అండగా నిలుస్తుందని, అర్హత ఉన్న ప్రతి దరఖాస్తుదారుడికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. 22ఏ ఫిర్యాదులకు సంబంధించి ఏర్పాటు చేసిన కాల్ సెంటర్‌కు వస్తున్న కాల్స్, వాటి పరిష్కారం, ఏయే సమస్యలపై ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయి, వచ్చిన కాల్స్‌కు ఎలాంటి సమాచారం అందిస్తున్నారు తదితర అంశాలపై బుధవారం అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో మంత్రి గారు సమీక్షించారు. నాలుగు జిల్లాల్లో 22ఏ అంశంపై ప్రస్తుత పరిస్థితి, దరఖాస్తుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు సుమారు 400 కాల్స్ వచ్చినట్లు ఈ సందర్భంగా అధికారులు మంత్రి గారి దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ కాల్ సెంటర్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదును నమోదు చేసి వదిలేయకుండా, దరఖాస్తుదారుడి పూర్తి వివరాలను ఎప్పటికప్పుడు సంబంధిత తహసీల్దార్, ఆర్డీవో, సబ్‌రిజిస్ట్రార్ తదితర అధికారులకు పంపించాలని ఆదేశించారు. ఆ సమస్య పరిష్కారమయ్యే వరకు దాని పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. కాల్ సెంటర్ నుంచి ఆన్‌లైన్‌లో ఫిర్యాదు స్వీకరించిన అధికారులు తక్షణమే స్పందించాలని ఆదేశించారు. వచ్చిన ఫిర్యాదుపై నిజానిజాలను నిర్ధారించి, దరఖాస్తుదారు పేర్కొన్న సమస్య వాస్తవమా? భూమి 22ఏ జాబితాలోకి ఎందుకు వచ్చింది? దరఖాస్తుదారుడికి అర్హత ఉందా? అనే అంశాలను క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించాలని సూచించారు. పరిశీలన అనంతరం స్పష్టమైన కారణాలతో నిర్ణయం తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు తమ సమస్యను చెప్పిన తర్వాత పరిష్కారం కోసం మళ్లీ మళ్లీ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా చూడాలని స్పష్టం చేశారు. ఇప్పటికే సబ్ రిజిస్ట్రార్లు, తహసీల్దార్లు, ఆర్డీవోలు, కలెక్టర్ల స్థాయిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులతో పాటు, గడచిన రెండు మడు రోజుల్లో కొత్తగా వచ్చిన దరఖాస్తులను కూడా వెంటనే పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. ఇకపై కొత్తగా వచ్చే దరఖాస్తులు పెండింగ్‌లో పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. 2ఏ సమస్య పరిష్కారాన్ని ప్రత్యేక టాస్క్‌గా తీసుకుని అధికారులు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ పనిచేయాలని మంత్రి ఆదేశించారు. రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రెవెన్యూ కార్యాలయానికి వచ్చిన వ్యక్తి తన సమస్య పరిష్కారమవుతుందనే నమ్మకంతో బయటకు వెళ్లాలి. వచ్చిన దరఖాస్తును మరో కార్యాలయానికి పంపించి చేతులు దులుపుకోకండి. చివరి వరకు పర్యవేక్షించండి. వి పనితీరుతో ప్రజల అభిమానాన్ని చూరగొనండి' అని అధికారులకు సూచించారు. అధికారులు సొంత నిర్ణయాలతో ప్రజలకు ఇబ్బంది కలిగించకూడదని, ప్రభుత్వ ఆలోచనలు, విధానాలకు అనుగుణంగా పనిచేయాలని స్పష్టం చేశారు.

### నేటి నుంచి జిల్లాల వారీగా రెవెన్యూ సమీక్షలు

ప్రజలకు రెవెన్యూ సేవలను మరింత చేరువ చేయడం, భూ సంబంధిత సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కారం చూపడమే లక్ష్యంగా రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లాల వారీగా సమీక్షలకు శ్రీకారం చుడుతున్నారు. శుక్రవారం నుంచి ప్రారంభమయ్యే ఈ సమీక్షలు కేవలం అధికారిక సమావేశాలకే పరిమితం కాకుండా.. క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటికి పరిష్కార మార్గాలను నిర్దేశించే విధంగా కొనసాగనున్నాయి. హైదరాబాద్ చుట్టుపక్కల జిల్లాల సమీక్షలను హైదరాబాద్ కేంద్రంగా నిర్వహించడంతో పాటు, దూర ప్రాంత జిల్లాలకు మంత్రి స్వయంగా వెళ్లి అక్కడే సమీక్షలు నిర్వహించనున్నారు. కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు, తహశీల్దార్లు, ఇతర రెవెన్యూ అధికారులు, సబ్ రిజిస్ట్రార్లతో సహా సంబంధిత శాఖల అధికారులందరూ ఈ సమీక్షల్లో పాల్గొంటారు. ఆయా ప్రాంతాలకు సంబంధించిన ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలను కూడా సమీక్షల్లో భాగస్వాములను చేసి.. ప్రజల నుంచి వస్తున్న సమస్యలు, స్థానిక అవసరాలు, పరిష్కరించాల్సిన అంశాలను నేరుగా తెలుసుకునే విధంగా మంత్రిగారు ఈ సమీక్షలను నిర్వహించనున్నారు. రెవెన్యూ అంశాలతో పాటు ఇందిరమ్మ ఇళ్లు, హౌసింగ్ పథకాల అమలు, లబ్ధిదారుల ఎంపిక, ఇళ్ల నిర్మాణ పురోగతి, స్థలాల సమస్యలు తదితర అంశాలను కూడా జిల్లా సమీక్షల్లో మంత్రి పరిశీలించనున్నారు. జిల్లాల వారీగా చేపట్టనున్న సమీక్షల్లో భాగంగా శుక్రవారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా సమీక్షను జగిత్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించనున్నారు. శనివారం ఉమ్మడి నిజామాబాద్ జిల్లా సమీక్ష జిల్లా కేంద్రంలో నిర్వహించనున్నారు.

## రెవెన్యూ మంత్రి పొంగులేటిని బర్తరఫ్ చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

### 30శాతం కమీషన్ల ఆరోపణలపై విచారణ

రెవెన్యూ శాఖలో జరుగుతున్నట్లు ఆరోపిస్తున్న 30 శాతం కమీషన్ల వ్యవహారం వెనుక ఎవరున్నారో తేల్చాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఓఆర్ఆర్ పరిసర ప్రాంతాల్లో భూములపై వివాదాలు సృష్టించి, రాజకీయ పలుకుబడి ఉన్న బినామీ సంస్థలతో 50:50 నిష్పత్తిలో జాయింట్ డెవలప్‌మెంట్ ఒప్పందాలు చేసుకునేలా భూ యజమానులపై ఒత్తిడి తెస్తున్నారనే ఆరోపణలను లేఖలో ప్రస్తావించారు. దళారులు, బినామీ సంస్థలను నడిపిస్తున్న రాజకీయ శక్తులు ఎవరో స్వతంత్ర దర్యాప్తులో తేల్చాలని కోరారు. యాదాద్రి జిల్లాలో సుమారు 40 వేల ఎకరాలను 22ఏ జాబితాలో చేర్చినట్లు నాలుగు నెలల క్రితమే మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చెప్పారని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. రెవెన్యూ శాఖలో ప్రైవేటు వ్యక్తుల ప్రయోజనాల కోసం ఇంతటి వ్యవహారం జరుగుతున్నా ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు.

### రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తితో విచారణ

2023 డిసెంబర్ నుంచి ఇప్పటివరకు 22ఏ నిషేధిత జాబితాలో చేర్చిన, తొలగించిన ప్రతి భూమిపై రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తితో స్వతంత్ర విచారణ జరిపించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించి ఏ ఆస్తిని ఎవరు జాబితాలో చేర్చారు, ఎందుకు చేర్చారు, ఎవరి ఆదేశాలతో తొలగించారు, మధ్యవర్తుల ప్రమేయం ఉందా, ఆర్థిక లావాదేవీలు జరిగాయా అనే అంశాలను నిగ్గు తేల్చాలని కోరారు. దశాబ్దాల క్రితమే పట్టణ భూ గరిష్ఠ పరిమితి చట్టం కింద క్రమబద్ధీకరించిన ఆస్తులు, చట్టబద్ధమైన రిజిస్టర్డ్ పత్రాలు ఉన్న భూములను మళ్లీ 22ఏ జాబితాలో చేర్చి రిజిస్ట్రేషన్లను స్తంభింపజేయడం దుర్మార్గమని విమర్శించారు.

### జిల్లాల వారీగా 22ఏ జాబితా బహిర్గతం చేయాలి

రాష్ట్రంలోని 22ఏ నిషేధిత భూముల జాబితాను జిల్లాల వారీగా ప్రజలకు అందుబాటులో ఉండేలా బహిరంగపరచాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఏ భూమిని ఎప్పుడు జాబితాలో చేర్చారు, ఎవరి ఆదేశాలతో చేర్చారు, ఎప్పుడు తొలగించారు అనే పూర్తి వివరాలను ప్రజలకు పారదర్శకంగా తెలియజేయాలని కోరారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన 'భూమాత' కార్యక్రమం భూ రికార్డులకు స్పష్టత ఇవ్వాల్సింది పోయి, ప్రజల ఆస్తులను స్తంభింపజేసే పరిస్థితికి దారితీయకూడదని హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. ఒక మంత్రిని కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని పణంగా పెడుతోందని ఆరోపించారు.

### ఆరోపణలు తప్పయితే నిరూపించుకోవాలి

తాను చేసిన ఆరోపణలు అవాస్తవమైతే వెంటనే స్వతంత్ర విచారణకు ఆదేశించి రాష్ట్ర ప్రభుత్వం తన నిజాయితీని నిరూపించుకోవాలని హరీశ్‌రావు సవాల్ చేశారు. 30 శాతం కమీషన్లు, 50:50 జాయింట్ డెవలప్‌మెంట్ ఒప్పందాల వెనుక ఉన్న వ్యక్తులు, సంస్థలు, రాజకీయ సంబంధాలపై సమగ్ర దర్యాప్తు జరగాలని కోరారు. ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించే వరకు, బాధితులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని హరీశ్‌రావు స్పష్టం చేశారు. ఈ వ్యవహారంపై రాహుల్ గాంధీ తక్షణమే జోక్యం చేసుకుని స్వతంత్ర విచారణకు చర్యలు తీసుకోవాలని ఆయన లేఖలో కోరారు.

## భద్రాచలం 5 గ్రామాల విలీనానికి తుమ్మల విజ్ఞప్తి

(మొదటి పేజీ తరువాయి)

పరిష్కారం కాకుండా ఉన్న అంశాలతో పాటు అంతర్రాష్ట్ర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు మంత్రి లేఖలు అందించారు. ముఖ్యంగా భద్రాచలం పరిసరాల్లోని యాటపాక, కన్నాయిగూడెం, పిచ్చికలపాడు, పురుషోత్తపట్నం, గుండాల ఐదు గ్రామ పంచాయతీల పరిధిలోని 19 రెవెన్యూ గ్రామాలను తిరిగి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో విలీనం చేయాలని కోరారు. ఈ గ్రామాల మొత్తం విస్తీర్ణం 11,122.01 ఎకరాలు కాగా, ప్రస్తుతం అవి భౌగోళికంగా తెలంగాణ భూభాగాల మధ్య, గోదావరి నది, అటవీ ప్రాంతాల నడుమ ఉండటంతో ప్రజలు పరిపాలనా సేవలు పొందడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రం సుమారు 282 కిలోమీటర్ల దూరంలో ఉండగా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రం కేవలం 40 కిలోమీటర్ల దూరంలోనే ఉందని వివరించారు. అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుల కారణంగా వ్యవసాయ, అటవీ ఉత్పత్తుల రవాణాలో గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారని, భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయానికి సంబంధించిన భూముల్లో కొంత భాగం పురుషోత్తపట్నంలో ఉండటంతో ఆలయ పరిపాలనలోనూ సమస్యలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. ఇదే సమయంలో 2024 జూలై 18న భారీ వర్షాలకు దెబ్బతిన్న పెద్దవాగు ప్రాజెక్టు శాశ్వత పునరుద్ధరణకు ఏపీ ప్రభుత్వం తన వాటా నిధులను వెంటనే విడుదల చేయాలని చంద్రబాబును కోరారు. ఈ ప్రాజెక్టు ద్వారా మొత్తం 16 వేల ఎకరాలకు సాగునీరు అందుతుండగా, అందు లో 13,640 ఎకరాల ఆయకట్టు ఏపీలోనే ఉందని తెలిపారు. శాశ్వత పునరుద్ధరణకు రూ.92.20 కోట్లు అవసరమని, 85.25 శాతం ఆయకట్టు ఏపీలో ఉన్నందున నిష్పత్తి ప్రాతిపదికన ఏపీ తన వాటా నిధులను అందించాలని విజ్ఞప్తి చేశారు. మరోవైపు ఆయిల్‌పామ్ రైతుల ఆదాయ భద్రత కోసం గెలల ధరను టన్నుకు రూ.25 వేలుగా నిర్ణయించేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవడానికి సహకరించాలని చంద్రబాబును కోరారు. అధిక సాగు వ్యయాలు, అంతర్జాతీయ క్రూడ్ పామ్ ఆయిల్ ధరల్లో హెచ్చుతగ్గుల కారణంగా రైతులు నష్టపోతున్నారని, కనీస హామీ ధరతో పాటు సాగు వ్యయానికి అనుసంధానమైన కాలానుగుణ ధర సవరణ విధానం అమలు చేయాలని తెలిపారు. అలాగే భద్రాచలం నుంచి చింతలపూడి, దమ్మపేట మీదుగా ఏలూరు వరకు ఉన్న సుమారు 160–165 కిలోమీటర్ల అంతర్రాష్ట్ర రహదారిని జాతీయ రహదారిగా ప్రకటించేలా కేంద్రంపై ఒత్తిడి తేవాలని ఏపీ సీఎంను కోరారు. ఈ రహదారి భద్రాచలం వద్ద ఎన్‌హెచ్–30ను, ఏలూరు వద్ద ఎన్‌హెచ్–16ను అనుసంధానించే కీలక మార్గమని, గిరిజన ప్రాంతాలకు మార్కెట్లు, వైద్యం, విద్య, ఉపాధి అవకాశాలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించడంతో పాటు తెలంగాణ–ఆంధ్రప్రదేశ్ మధ్య ప్రాంతీయ అనుసంధానాన్ని మరింత బలోపేతం చేస్తుందని మంత్రి తుమ్మల వివరించారు. తెలంగాణ ప్రయోజనాలతో పాటు రెండు రాష్ట్రాల ప్రజల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించేలా కేంద్రం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని ఆయన కోరారు.

వార్త వేదిక సూర్య
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY
www.vaarthavedhikasurya.com


రంగారెడ్డి



## మణికొండలో హైడ్రా పరిరక్షించిన భూములకు రక్షణ కల్పించాలి

**- ఆక్రమణలను అడ్డుకోవాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు వినతి**

రాజేంద్రనగర్, ఆగస్టు 20 ( వార్త వేదిక సూర్య ) :

హైడ్రా పరిరక్షించిన భూములను కొంతమంది వ్యక్తులు మళ్లీ ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్న నేపథ్యంలో, ఫెడరేషన్ ఆఫ్ ఆల్ కాలనీస్ అధ్యక్షుడు అర్వపల్లి వంశీ ఆధ్వర్యంలో తిరుమల హిల్స్ కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను కలిసి పరిస్థితిని వివరించారు. మణికొండలోని తిరుమల హిల్స్, వెంకటేశ్వర్ కాలనీ తదితర ప్రాంతాల్లో హైడ్రా ఇప్పటికే పరిరక్షించిన భూములు భవిష్యత్తులో ఎలాంటి ఆక్రమణలకు గురికాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ప్రతినిధులు కోరారు. ప్రతినిధులు వివరించిన అంశాలను కమిషనర్ రంగనాథ్ శ్రద్ధగా విని, పరిరక్షించిన భూములను కాపాడేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సంబంధిత ప్రాంతాలను హైడ్రా సీనియర్ ఇన్‌స్పెక్టర్లు స్వయంగా పరిశీలించి, తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా, హైడ్రా పరిరక్షించిన భూమిలో స్థానిక ప్రజల ప్రయోజనం కోసం పార్కును అభివృద్ధి చేసేందుకు సహకరించాలని ప్రతినిధులు కోరారు. దీనిపై కమిషనర్ సానుకూలంగా స్పందించి, ఈ అంశాన్ని పరిశీలిస్తామని తెలిపారు. మణికొండలో హైడ్రా పరిరక్షించిన భూములు భవిష్యత్తులో ఆక్రమణలకు గురికాకుండా సురక్షితంగా ఉండటంతో పాటు, ప్రజల ప్రయోజనాలకు ఉపయోగపడే విధంగా అభివృద్ధి చెందుతాయని ఫెడరేషన్ ఆశాభావం వ్యక్తం చేసింది. సమస్యపై తక్షణమే స్పందించి, సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసిన హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు ఫెడరేషన్ ఆఫ్ ఆల్ కాలనీస్, తిరుమల హిల్స్ కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో ఫెడరేషన్ ఆఫ్ ఆల్ కాలనీస్ అధ్యక్షుడు అర్వపల్లి వంశీ, తిరుమల హిల్స్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు డా. అవినాష్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, ట్రెజరర్ సుభాష్, కాలనీ నివాసి రంగాచారి పాల్గొన్నారు.

## దేశ అభివృద్ధి, ఆధునిక భారత నిర్మాణం కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయం : ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

రాజేంద్రనగర్, ఆగస్టు 20 ( వార్త వేదిక సూర్య ) :



భారత మాజీ ప్రధానమంత్రి, భారతరత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి కార్యక్రమాన్ని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎన్. ధనుంజయ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజేంద్రనగర్ శాసనసభ్యుడు టి. ప్రకాష్ గౌడ్ హాజరై రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ.. రాజీవ్ గాంధీ యువతకు అధిక ప్రాధాన్యతనిస్తూ, దేశాన్ని సాంకేతిక రంగంలో ముందుకు తీసుకెళ్లేందుకు అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టిన దూరదృష్టి కలిగిన నాయకుడని కొనియాడారు. దేశ అభివృద్ధి, ఆధునిక భారత నిర్మాణం కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. రాజీవ్ గాంధీ ఆశయాలను ప్రతి కాంగ్రెస్ కార్యకర్త ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎన్. ధనుంజయ, టి. ప్రేమ్ గౌడ్, మాధవరెడ్డి, సుధాకర్ గౌడ్, సరికొండ వెంకటేష్, జీవన్ గౌడ్, అడిగే అర్జున్, గట్టయ్య, భాష శ్రీనివాస్, లక్ష్మారెడ్డి, అనిల్, పవన్, బాబురావు, గోపి, అనంతం గౌడ్, శేఖర్, నాని, ఏసు, విజయ్, ఫయామ్ భాయ్, మహమ్మద్, మామిడి శెట్టి శ్రీనివాస్, హరినాథ్, శరణమ్మ, లావణ్య, అశ్విని, మానస, సునీత, నీలం భూదేవి, జయశ్రీ, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

## మహాత్మా గాంధీ పార్కు పునరుద్ధరణ పనులకు శ్రీకారం : ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

రాజేంద్రనగర్, ఆగస్టు 20 ( వార్త వేదిక సూర్య ) :



నార్సింగి సర్కిల్ పరిధిలోని మణికొండ అల్కాపూర్ టౌన్‌షిప్‌లో ఉన్న మహాత్మా గాంధీ పార్కు పునరుద్ధరణ పనులకు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్థానిక ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడంతో పాటు పిల్లలు, మహిళలు, వృద్ధులకు ఉపయోగపడేలా పార్కును మరింత అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. పార్కులో అవసరమైన మౌలిక వసతులను కల్పించి, స్థానికులకు మెరుగైన వాకింగ్, వ్యాయామం, విశ్రాంతి సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురానున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, గుడిమల్కాపూర్ చైర్మన్ మల్లేశ్ ముదిరాజ్, నార్సింగి మార్కెట్ చైర్మన్ వేణుగౌడ్, మార్కెట్ డైరెక్టర్ లక్ష్మీశ్రీ, బాలారెడ్డి, జితేంద్ర, మాజీ కౌన్సిలర్ రామకృష్ణ రెడ్డి, బషీర్, దాసు, ప్రభావతి, పద్మారావు, శ్రవణ్, నరేష్‌తో పాటు పలువురు మణికొండ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# వంబే కాలనీలో డ్రైనేజీ సమస్యను వెంటనే పరిష్కరించాలి





**- మురుగునీటితో స్థానికుల అవస్థలు -- అధికారులు స్పందించాలి**

రాజేంద్రనగర్, ఆగస్టు 20 ( వార్త వేదిక సూర్య ) :

వంబే కాలనీలో నెలకొన్న డ్రైనేజీ సమస్యను వెంటనే పరిష్కరించాలని బీఆర్ఎస్ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు గుమ్మడి కుమార్, నాయకులు అకేం రాఘవేందర్ యాదవ్, బండ రాజేష్ డిమాండ్ చేశారు.వంబే కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో మురుగునీరు ఇళ్ల మధ్య, రహదారులపై నిలిచిపోతుందని వారు తెలిపారు. రోజుల తరబడి మురుగునీరు నిల్వ ఉండటంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా వర్షాలు కురిసిన సమయంలో పరిస్థితి మరింత దారుణంగా మారుతోందని, డ్రైనేజీ నీరు రోడ్లపైకి వచ్చి ప్రజలు రాకపోకలు సాగించేందుకు కూడా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మురుగునీరు నిల్వ ఉండటంతో దుర్వాసన వెదజల్లడంతో పాటు దోమలు, ఈగలు పెరిగి ప్రజలకు అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందన్నారు. చిన్నారులు, వృద్ధులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీలో డ్రైనేజీ సమస్య ఏళ్లుగా కొనసాగుతున్నప్పటికీ శాశ్వత పరిష్కారం దిశగా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. డ్రైనేజీ పైపులైన్లను పరిశీలించి అవసరమైన చోట కొత్త పైపులు ఏర్పాటు చేయడంతో పాటు, పూడికలు తొలగించి మురుగునీరు సాఫీగా వెళ్లేలా చర్యలు చేపట్టాలని వారు కోరారు. కాలనీలో ప్రధాన డ్రైనేజీ మార్గాలను గుర్తించి శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలు నిత్యం ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి తక్షణమే పరిష్కరించాలని గుమ్మడి కుమార్, అకేం రాఘవేందర్ యాదవ్, బండ రాజేష్ కోరారు. వంబే కాలనీలో డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపకపోతే స్థానిక ప్రజలతో కలిసి సమస్య పరిష్కారం కోసం మరింత పెద్ద ఎత్తున పోరాటం చేపడతామని వారు హెచ్చరించారు. ప్రజల ఆరోగ్యం, పారిశుద్ధ్యం విషయంలో అధికారులు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే ప్రత్యేక చర్యలు చేపట్టి వంబే కాలనీకి డ్రైనేజీ సమస్య నుంచి విముక్తి కల్పించాలని వారు డిమాండ్ చేశారు.

# శివపురి కాలనీలో ఓటరు సహాయ శిబిరానికి విశేష స్పందన

రాజేంద్రనగర్, ఆగస్టు 20 ( వార్త వేదిక సూర్య ) :



భారత రాష్ట్ర సమితి పార్టీ మణికొండ మున్సిపల్ డివిజన్, నెక్నాంపూర్ మున్సిపల్ డివిజన్ నాయకుల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఓటరు సహాయ శిబిరానికి శివపురి కాలనీ ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. పోలింగ్ కేంద్రం నంబర్ 29 నుంచి 81 వరకు కొత్తగా వెలువడిన ఓటరు జాబితాలో తమ పేర్లు సక్రమంగా నమోదయ్యాయా లేదా అనే సందేహాలను నివృత్తి చేసుకునేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో శిబిరానికి తరలివచ్చారు.భారత ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ)లో భాగంగా ఓటర్ల వివరాల డిజిటలైజేషన్, ఓటు నమోదు స్థితి, పోలింగ్ కేంద్రాల వివరాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ సహాయ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. తమ ఓటు నమోదు అయిందా లేదా అనే విషయాన్ని తెలుసుకునేందుకు శివపురి కాలనీ ప్రజలు తండోపతండాలుగా శిబిరానికి రావడంతో అనూహ్య స్పందన లభించిందన్నారు. కొత్తగా వెలువడిన ఓటరు జాబితాలో కుటుంబ సభ్యుల ఓట్లు వేర్వేరు పోలింగ్ కేంద్రాల్లో నమోదవుతున్న విషయంపై పలువురు ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులందరి ఓట్లు ఒకే పోలింగ్ కేంద్రం పరిధిలో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఓటరు జాబితాను సమగ్రంగా పరిశీలించి, అవసరమైన సవరణలు చేపట్టాలని వారు అభిప్రాయపడ్డారు.ఇదిలా ఉండగా, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై కూడా పలువురు అసంతృప్తి వ్యక్తం చేశారని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. ఓటర్ల హక్కులను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ తమ పేరు ఓటరు జాబితాలో సక్రమంగా ఉందో లేదో పరిశీలించు కోవాలని వారు సూచించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు గుట్టమీది నరేందర్, అందె లక్ష్మణ్ రావు, సుమనళిని, జై రామ్‌తో పాటు స్థానికులు మధు, శ్రీనివాస్ గౌడ్, సత్యనారాయణ, సావిత్రి, శివగంగా తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

**రాష్ట్ర మున్సిపల్ సంఘం ప్రధాన కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి**

రాజేంద్రనగర్, ఆగస్టు 20 ( వార్త వేదిక సూర్య ) :



మున్సిపల్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరిం చాలని తెలంగాణ మున్సిపల్ స్టాఫ్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు వికారాబాద్ మున్సిపల్ కమిషనర్ గంగుల విక్రమ్ సింహారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జైపాల్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెల ఒకటో తేదీన వేతనాలు చెల్లిస్తామని ప్రకటించినప్పటికీ, వికారాబాద్ మున్సిపల్ సంస్థలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులకు ఇప్పటివరకు వేతనాలు అందకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఎస్టీఓలో ఉన్న వేతనాలను వెంటనే కార్మికుల ఖాతాల్లో జమ చేయాలని కోరారు.

మున్సిపల్ కార్మికుల వేతనాలను తగ్గిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో ఆర్టీ నంబర్ 1181పై మున్సిపల్ చైర్మన్‌తో తీర్మానం చేసి, జీవో ఎంఎస్ నంబర్ 60 ప్రకారం గతంలో అమలు చేసిన విధంగా కేటగిరీల వారీగా వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక పంపాలని కమిషనర్‌ను విజ్ఞప్తి చేశారు.

అలాగే సీడీఎంఏ కమిషనర్ జారీ చేసిన సర్క్యులర్ ప్రకారం మున్సిపల్ కార్మికులకు 15 క్యాజువల్ సెలవులు, జాతీయ సెలవులు, 8 పండుగ సెలవులు అమలు చేయాలని, ఈఎస్ఐ, ఈపీఎఫ్ ఖాతాల్లో చెల్లింపులు సక్రమంగా జమ చేయడంతో పాటు కార్మికులకు పీఎఫ్ స్లిప్పులు అందించాలని కోరారు. కార్మికులందరికీ అవసరమైన పనిముట్లను ఎలాంటి పెండింగ్ లేకుండా తక్షణమే అందించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్మికుల సమస్యలపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నివేదిక పంపుతామని మున్సిపల్ కమిషనర్ గంగుల విక్రమ్ సింహారెడ్డి తెలిపారు. సీడీఎంఏ కమిషనర్ ఇచ్చిన ఆదేశాలను తూచా తప్పకుండా అమలు చేస్తామని హామీ ఇచ్చారు.

## ప్రతి విద్యార్థిలోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలి.. సీఆర్పీ రమేష్

రాజేంద్రనగర్, ఆగస్టు 20 ( వార్త వేదిక సూర్య ) :



విద్యార్థుల్లో ప్రాథమిక విద్యా నైపుణ్యాలను బలోపేతం చేసి, వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమం కొనసాగుతోంది. ఇందులో భాగంగా రాజేంద్రనగర్ స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో ఎంపిక చేసిన బుద్వేల్ ప్రాథమిక పాఠశాల, యుపిఎస్ గగన్‌పహాడ్, పద్మశాలిపురం ప్రాథమిక పాఠశాలల్లో రెండో తరగతి విద్యార్థుల అభ్యసన స్థాయిని సీఆర్పీ రమేష్ పరిశీలించారు.తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులతో నేరుగా మాట్లాడిన ఆయన వారి చదువు, రాత, అవగాహన సామర్థ్యాలను స్వయంగా పరిశీలించారు. విద్యార్థులు తమ తరగతి స్థాయికి అనుగుణంగా చదవడం, రాయడం, గణితంలోని ప్రాథమిక భావనలను అర్థం చేసుకోవడం వంటి అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సీఆర్పీ రమేష్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థిలోనూ ప్రతిభ దాగి ఉంటుందని, దానిని గుర్తించి సరైన ప్రోత్సాహం అందిస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని అన్నారు. చదువులో కొంత వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ చూపడంతో పాటు, వారి స్థాయికి అనుగుణంగా అభ్యాస అవకాశాలు కల్పిస్తామని తెలిపారు.

విద్యార్థులను ప్రోత్సహిస్తూ, చిన్నచిన్న విజయాలను కూడా అభినందించడం ద్వారా వారిలో చదువుపై ఆసక్తి, ఆత్మవిశ్వాసం పెరుగుతుందని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థి అభ్యసన స్థాయిని నిరంతరం గమనిస్తూ అవసరమైన సహకారం అందించాలని సూచించారు..కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## బాపూఘాట్ నుంచి హైదర్‌గూడ గ్రేవ్‌యార్డు వరకు సీసీ రోడ్డు పనులు చేపట్టాలి

రాజేంద్రనగర్ ఆగస్టు 20 ( వార్త వేదిక సూర్య ) :

బాపూఘాట్ సమీపంలోని బ్రిడ్జి నుంచి హైదర్‌గూడ గ్రేవ్‌యార్డు వరకు సీసీ రోడ్డు నిర్మాణ పనులను వెంటనే చేపట్టాలని నాయకులు అధికారులను కోరారు. ఈ మేరకు ట్రాఫిక్ ఏసీపీ ధనలక్ష్మి, టోలిచౌకి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కిరణ్, మున్సిపల్ ఏఈ రోహిత్‌లతో కలిసి చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి సాబాద విజయకుమార్, కైలా రవీందర్ రెడ్డి, రుకేష్ కుమార్, సాయినాథ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజు తదితరులు సంబంధిత ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్డుపై వర్షపు నీరు నిల్వ ఉండకుండా అవసరమైన పైప్‌లైన్ ఏర్పాటు చేసి, అనంతరం సీసీ రోడ్డు పనులను ఆలస్యం చేయకుండా ప్రారంభించాలని అధికారులను కోరారు. అలాగే రోడ్డు పనుల సమయంలో ప్రజలకు, వాహనదారులకు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నాయ మార్గాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రాంతంలో రోడ్డు పరిస్థితిని మెరుగుపరిచి, వర్షపు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు ప్రజల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

## ఎస్ఐఆర్‌పై అప్రమత్తంగా ఉండాలి: కార్తీక్ రెడ్డి

రాజేంద్రనగర్, ఆగస్టు 20 ( వార్త వేదిక సూర్య ) :



రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తీక్ రెడ్డి నివాసంలో రాజేంద్రనగర్, అత్తాపూర్ సర్కిల్ ఇన్‌చార్జీలు, డివిజన్ అధ్యక్షులు, ముఖ్య నాయకులు, బీఎల్ఏలతో కీలక సమావేశం నిర్వహించారు. సమావేశంలో రాజేంద్రనగర్, అత్తాపూర్ సర్కిల్ పరిధిలో జరుగుతున్న ఎస్ఐఆర్ (ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ) ప్రక్రియపై నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని కార్తీక్ రెడ్డి సూచించారు. ప్రతి డివిజన్‌లో ఓటు హక్కు కోల్పోయిన వారి వివరాలను బీఎల్ఏల ద్వారా గుర్తించి, అవసరమైన ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. నిజమైన ఓటరు ఒక్కరు కూడా ఓటు హక్కు కోల్పోకుండా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని, ప్రతి డివిజన్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఇప్పటివరకు బీఆర్ఎస్ పార్టీ తరఫున ఎస్ఐఆర్ కార్యక్రమంలో చురుకుగా పాల్గొంటున్న నాయకులు, కార్యకర్తలు, బీఎల్ఏలకు కార్తీక్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో సీనియర్ నాయకులు, ముఖ్య నాయకులు, బీఎల్ఏలు, మహిళా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఎం. సరోజినీ రెడ్డికి ఘన సన్మానం

సికింద్రాబాద్, ఆగస్టు 20(వార్త వేదిక సూర్య)



సికింద్రాబాద్‌లోని కేంద్ర కార్యాలయంలో మజ్దూర్ యూనియన్ జోనల్ కోశాధికారి, రైల్ నిలయం అడ్మిన్ విభాగం చైర్‌పర్సన్ ఎం. సరోజినీ రెడ్డి బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆమెను గురువారం సికింద్రాబాద్ పద్మశాలి సంఘం అధ్యక్షులు మంద జగన్ మర్యాద పూర్వకంగా కలసి శాలువతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సరోజినీ రెడ్డి మాట్లాడుతూ తనపై చూపిన గౌరవానికి కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులోనూ కార్మికుల సంక్షేమం కోసం మరింత నిబద్ధతతో పనిచేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చింతకింది మల్లేష్, కొండ కిషోర్ గౌడ్, యూ.సచిన్ తదితరులు పాల్గొన్నారు.

## రాజేంద్రనగర్‌లో 1,96,570 మందికి నోటీసులు

**మ్యాపింగ్ కాని వారు 99,396 మంది..**

**- పేర్లు, చిరునామాల్లో తప్పులున్న వారు 96,676 మంది**

రాజేంద్రనగర్, ఆగస్టు 20 ( వార్త వేదిక సూర్య ) :




రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా మ్యాపింగ్ కాని వారు, పేర్లు, చిరునామాల్లో తప్పులున్న 1,96,570 మందికి ఈ నెల 21వ తేదీ నుంచి నోటీసులు అందజేయనున్నట్లు నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి సోలిపేట శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ప్రత్యేక సమగ్ర సవరణలో వివిధ కారణాల వల్ల ఓట్ల తొలగింపు అనంతరం నియోజకవర్గంలో 3,88,278 మంది ఓటర్లు మాత్రమే మిగిలినట్లు తెలిపారు. వీరిలో మ్యాపింగ్ కాని వారు 99,396 మంది ఉండగా, పేర్లు, చిరునామాల్లో తప్పులు ఉన్న వారు 96,676 మంది ఉన్నారని పేర్కొన్నారు. ఈ రెండు కేటగిరీలకు చెందిన మొత్తం 1,96,570 మందికి నోటీసులు జారీ చేయనున్నట్లు వెల్లడించారు. బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి సంబంధిత ఓటర్లకు నోటీసులు అందజేస్తారని తెలిపారు. నోటీసులు అందుకున్న ఓటర్లు తగిన ధ్రువపత్రాలను సమర్పించి తమ ఓటు హక్కునుపదిలపరచుకోవాలని సూచించారు. ఓటర్లు ఈ ప్రక్రియను నిర్లక్ష్యం చేయకుండా నిర్ణీత సమయంలో స్పందించాలని సోలిపేట శ్రీనివాస్ రెడ్డి కోరారు.

www.vaarthavedikasurya.com
వార్త వేదిక సూర్య తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY
సంపుటి : 2
సంచిక : 93
శుక్రవారం
21 ఆగస్టు 2026

# వ్యవసాయ కళాశాలలో మాదకద్రవ్యాల దుర్వినియోగం, నేరాలపై అవగాహన

**రాజేంద్రనగర్, ఆగస్టు 20 ( వార్త వేదిక సూర్య ) :**
ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవసాయ కళాశాల రాజేంద్రనగర్‌లో మాదకద్రవ్యాల వ్యతిరేక కమిటీ, జాతీయ సేవా పథకం బృందం ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల దుర్వినియోగం, నేరాలపై అవగాహన శిబిరాన్ని గురువారం నిర్వహించారు. అంతర్గత అవగాహన కార్యక్రమాల సంస్థ, నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో హైదరాబాద్ విభాగం సహకారంతో అకాడమిక్ బ్లాక్‌లో ఈ కార్యక్రమం జరిగింది.కార్యక్రమానికి వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డా. సి.హెచ్. నరేంద్ర రెడ్డి అధ్యక్షత వహించారు. నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో హైదరాబాద్ విభాగం ఇన్‌స్పెక్టర్లు పవన్ బి. కోల్హే, టి. అనిల్ కుమార్ వనరుల ప్రసంగకర్తలుగా పాల్గొన్నారు.పవన్ బి. కోల్హే మాట్లాడుతూ కెటమైన్, ఎల్ఎస్‌డీ, మెతాంఫెటమైన్, కోడైన్, ఎండీఎంఏ, ఎక్టసీ వంటి కృత్రిమ మాదకద్రవ్యాలు శారీరక, మానసిక ఆరోగ్యంతో పాటు విద్య, కుటుంబం, సమాజంపై తీవ్ర ప్రభావం




చూపుతాయని వివరించారు. మాదకద్రవ్యాలు, మానసిక పదార్థాల నియంత్రణ చట్టం కింద విధించే శిక్షలను వివరించడంతో పాటు మాదకద్రవ్యాల వ్యాపారులు యువతను ఎలా లక్ష్యంగా చేసుకుంటారో వివరించారు. టి. అనిల్ కుమార్ జాతీయ మాదకద్రవ్యాల సహాయవాణి 1933 గురించి విద్యార్థులకు వివరించారు. మాదకద్రవ్యాల అక్రమ వ్యాపారంపై గోప్యంగా సమాచారం అందించేందుకు, మాదకద్రవ్యాల బానిసత్వం నుంచి బయటపడేందుకు సహాయం పొందేందుకు ఈ సహాయవాణిని వినియోగించుకోవాలని సూచించారు. నషా ముక్త్ భారత్ అభియాన్, మాదకద్రవ్యాలకు 'నో' చెప్పాలనే ప్రచారంపై అవగాహన కల్పించారు. డా. సి.హెచ్. నరేంద్ర రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. చెడు స్నేహితుల ప్రభావానికి దూరంగా ఉండి చదువులు, క్రీడలపై దృష్టి సారించాలని అన్నారు. మాదకద్రవ్యాల వ్యతిరేక కమిటీ, జాతీయ సేవా పథకం బృందం, నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో చేస్తున్న కృషిని అభినందించారు. అనంతరం విద్యార్థులు, బోధనా, బోధనేతర సిబ్బంది కలిసి మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ సేవా పథకం స్వచ్ఛంద సేవకులు, విద్యార్థులు, బోధనా, బోధనేతర సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం ముగింపులో జాతీయ సేవా పథకం కార్యక్రమ అధికారులు ధన్యవాదాలు తెలిపారు.

## చేయూత పింఛన్‌కు కొత్త దరఖాస్తులకు ఆహ్వానం

**రాజేంద్రనగర్, ఆగస్టు 20 ( వార్త వేదిక సూర్య ) :**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న చేయూత పింఛన్ పథకం కింద అర్హులైన లబ్ధిదారుల నుంచి కొత్త దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు నార్సింగి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జి. లక్ష్మారెడ్డి తెలిపారు.

ఆగస్టు 31వ తేదీ వరకు అర్హత కలిగిన వారు చేయూత పింఛన్ కోసం కొత్తగా దరఖాస్తు చేసుకో వచ్చని ఆయన పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చేయూత పింఛన్‌కు సంబంధించిన అర్హతలు, దరఖాస్తు విధానం, అవసరమైన పత్రాలు, ఇతర వివరాల కోసం నార్సింగి సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సహాయ కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. తొలిదశలో ఒంటరి మహిళలు, వితంతువులు, దివ్యాంగులు, గీత కార్మికులు, చేనేత కార్మికులు, ఫైలేరియా బాధితులు, తలసేమియా, సికిల్ సెల్ వ్యాధి, హీమోఫీలియా వంటి రక్త సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారికి కొత్త పింఛన్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు.అర్హత ఉన్న వారు నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకుని ప్రభుత్వ సంక్షేమ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ కమిషనర్ జి. లక్ష్మారెడ్డి కోరారు.

## ప్రపంచ దోమల దినోత్సవంపై అవగాహన ర్యాలీ

**రాజేంద్రనగర్, ఆగస్టు 20 ( వార్త వేదిక సూర్య ) :**




ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా ఫలక్‌నుమా డివిజన్‌లో దోమల నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏఎంఓహెచ్ డాక్టర్ హేమలత పాల్గొని మాట్లాడారు. ప్రతి సంవత్సరం ఆగస్టు 20న ప్రపంచ దోమల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 1897 ఆగస్టు 20న డాక్టర్ రోనాల్డ్ రాస్ ఆడ ఎనాఫిలిస్ దోమ ద్వారా మలేరియా వ్యాధి వ్యాప్తి చెందుతుందనే విషయాన్ని కనుగొన్న సందర్భంగా ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. దోమకాటు ద్వారా వచ్చే మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా వంటి విషజ్వరాల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు పనికిరాని వస్తువుల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం 'ఫ్రైడే డ్రై డే'గా పాటించి, నీటి నిల్వ పాత్రలను వారానికి ఒకసారి ఖాళీ చేయడం ద్వారా దోమల వృద్ధిని అరికట్టవచ్చని తెలిపారు. దోమల లార్వా దశలోనే నిర్మూలించేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. ఇంటింటికీ వచ్చే ఏఎల్ఓ మలేరియా సిబ్బందికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఫలక్‌నుమా, జహనుమా డివిజన్ల సూపర్‌వైజర్లు మధు, అరుణ్ కుమార్, ఎంటమాలజీ (మలేరియా) సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## చెరువులో పడి పాలిటెక్నిక్ విద్యార్థి మృతి

**మహేశ్వరం, ఆగస్టు 20: వార్త వేదిక సూర్య**



మహేశ్వరం మండలంలోని కేసీ తండా కొత్వాల్ చెరువులో విషాదం చోటుచేసుకుంది. స్నేహితులతో కలిసి ఈతకు వెళ్లిన 16 ఏళ్ల విద్యార్థి సుప్రతిక్ ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాలకు చెందిన సుప్రతిక్ మహేశ్వరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డీఎస్‌సీటీ కోర్సు మొదటి సంవత్సరం చదువుతున్నాడు. గురువారం ఐదుగురు స్నేహితులతో కలిసి కేసీ తండాలోని కొత్వాల్ చెరువుకు ఈతకు వెళ్లాడు. స్నేహితుల్లో ఇద్దరికి మాత్రమే ఈత వచ్చు. వారు నీటిలో ఈత కొడుతుండగా.. మిగతా ముగ్గురు గట్టుపై ఉండి చూస్తున్నారు.ఈ క్రమంలో స్నేహితులు ఈత కొడుతుండటంతో తాను కూడా ఈత కొట్టాలనే ఉద్దేశంతో సుప్రతిక్ నీటిలోకి దిగాడు.అయితే ప్రమాదవశాత్తు లోతైన నీటిలోకి వెళ్లి మునిగిపోయాడు. స్నేహితులు గమనించి బయటకు తీసేందుకు ప్రయత్నించినప్పటికీ అప్పటికే మృతి చెందినట్లు తెలిసింది.సుప్రతిక్ తండ్రి రవి. కుటుంబంలో ఒక్క కుమారుడు, ఒక్క కుమార్తె ఉండగా.. కుమారుడి మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మృతదేహాని పోస్ట్ మార్టం నిమిత్తం ఉస్మానియా హాస్పటల్ కి తరలించారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కస్తూరిబా గాంధీ ట్రస్ట్‌ను సందర్శించిన ప్రొబేషనరీ డీఎస్పీలు

**- 112 మంది శిక్షణాధికారుల సందర్శన..**

**రూ.56 వేల విరాళం**

**రాజేంద్రనగర్, ఆగస్టు 20 ( వార్త వేదిక సూర్య ) :**
సమాజంలోని అణగారిన, ఆపన్న వర్గాల పట్ల మానవతా దృక్పథం, సామాజిక బాధ్యత పెంపొందించుకునే దిశగా ఆర్‌బీవీఆర్ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీలో శిక్షణ పొందుతున్న 112 మంది ప్రొబేషనరీ డీఎస్పీలు కస్తూరిబా గాంధీ జాతీయ స్మారక ట్రస్ట్‌ను సందర్శించారు. శిక్షణలో భాగంగా ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమం, ప్రజ్వల రక్షణ కేంద్రం, ప్రత్యేక సంరక్షణ కేంద్రాలు, మహిళలకు నైపుణ్య శిక్షణ అందిస్తున్న కేంద్రాలను వారు పరిశీలించారు. అక్కడి వృద్ధులు, రక్షించబడిన మహిళలు, ప్రత్యేక సంరక్షణ అవసరమైన వారితో ఆత్మీయంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారికి అల్పాహారం అందించారు. ట్రస్ట్ ఇన్‌చార్జిలు మూర్తి, శ్రీనివాస్, కౌన్సిలర్లు ట్రస్ట్ సేవా కార్యక్రమాలు, బాధితుల పునరావాసం, సేవా విధానం తదితర అంశాలను ట్రైనీ డీఎస్పీలకు వివరించారు. దేశవ్యాప్తంగా 22 ప్రాంతాల్లో ట్రస్ట్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల గురించి అవగాహన కల్పించారు. మహిళలకు వివిధ నైపుణ్యాల్లో శిక్షణ ఇచ్చి స్వయం ఉపాధి దిశగా ప్రోత్సహిస్తున్న కార్యక్రమాలను ట్రైనీ అధికారులు పరిశీలించారు. మహిళలు తయారు చేసిన



జనపనార సంచులను కొనుగోలు చేసి వారి స్వయం ఉపాధి ప్రయత్నాలను ప్రోత్సహించారు. ట్రస్ట్‌లోని సేవలను ప్రత్యక్షంగా పరిశీలించిన అనంతరం ట్రైనీ డీఎస్పీలు తమ వంతు సామాజిక బాధ్యతగా రూ.56 వేల విరాళాన్ని అందించారు. ఈ మొత్తాన్ని ట్రస్ట్ ఇన్‌చార్జి మూర్తికి అందజేశారు. సమాజంలోని బాధితులకు ప్రభుత్వ సంస్థలతో పాటు స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న సేవలను తెలుసుకోవడం తమకు విలువైన అనుభవమని ట్రైనీ అధికారులు తెలిపారు. పోలీసు విధులు కేవలం నేర నియంత్రణ, దర్యాప్తు, శాంతిభద్రతల పరిరక్షణకే పరిమితం కాకుండా బాధితులకు అండగా నిలవడం, బలహీన వర్గాలకు రక్షణ కల్పించడం కూడా ముఖ్యమని పేర్కొన్నారు. ఈ సందర్శనకు అవకాశం కల్పించిన తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్, ఐపీఎస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ ఆదూరి శ్రీనివాసరావు అనుసంధాన అధికారిగా వ్యవహరించారు.

## కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను కొనసాగించాలి

**బిఆర్ఎస్ పార్టీ తోనే ప్రజా సంక్షేమ అభివృద్ధి సాధ్యం**

**నేడు కుంటుపడుతున్న గ్రామాల అభివృద్ధి**

**పేదలకు కేసిఆర్ కొండంత అండ**

**టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు మాజీ సర్పంచ్ వీర నాయక్**

**మహేశ్వరం, ఆగస్టు, 20, వార్త వేదిక సూర్య**



కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకాలను కొనసాగించాలని టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు మాజీ సర్పంచ్ వీర నాయక్ అన్నారు. ఈ సందర్భంగా వీరా నాయక్ మాట్లాడుతూ గతంలో బిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ప్రజా సంక్షేమం ప్రజా సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ప్రజలకు ఎలాంటి కష్టం రాకుండా కంటికి రెప్పలాగా ప్రజలను కేసీఆర్ కాపాడుకుంటూ వచ్చారని కానీ నేడు కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలను నరకయాతన చూపిస్తూ అనేక ఇబ్బందులు పెడుతూ ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని వీర నాయక్ అన్నారు. కథ ప్రభుత్వంలో పేద ప్రజలకు పెద్దన్నగా అండగా నిలిచి ప్రజల కష్టాన్ని తన కష్టంగా గుర్తించి సమస్యలు పరిష్కారం చేశారని కానీ నేడు కాంగ్రెస్ ప్రభుత్వంలో పేదల పెళ్లికి ప్రభుత్వమిస్తున్న లక్ష రూపాయలు కానుక కళ్యాణ్ లక్ష్మీ షాదీ ముబారక్ పథకాలను నిలిపివేయడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే రైతు బంధు, రైతు బీమా వృద్ధాప్య పింఛన్ నాలుగు వేలు ఇస్తామని ఇప్పటివరకు రూపాయి కూడా ఇవ్వకుండా మహిళలకు 2500 రూపాయలు అనేక సంక్షేమ పథకాలకు మంగళం పాడి ప్రజల సంక్షేమ పథకాలను విస్మరిస్తూ ప్రజలకు నరకం చూపిస్తున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పుడున్న తెలంగాణ రాష్ట్రంలో ప్రజలు సారు కారు రావాలని ప్రజలు కోరుకుంటున్నారని కేసీఆర్ కోసం ఎదురుచూస్తున్నారని ఆయన అన్నారు. ప్రజా సంక్షేమం జరగాలన్న ప్రజల సంక్షేమ పథకాలు అమలు కావాలన్నా టిఆర్ఎస్ పార్టీ కేసీఆర్ రావాలని ప్రజలు కోరుకుంటున్నారని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలకు చేయడం కన్నా దోచుకోవడమే ఎక్కువ ఉందని అన్నారు. వెంటనే లక్ష్మీ షాదీ ముబారక్ పథకాలను కొనసాగించాలని వీరా నాయక్ డిమాండ్ చేశారు.

## బీజేపీ సర్కార్‌కు రోజులు దగ్గరపడ్డాయి

**కేంద్ర ప్రజా వ్యతిరేక విధానాలపై పోరుబాటే మార్గం : పాలమాకుల జంగయ్య**

**మహేశ్వరం, తుక్కుగూడలో నాలుగో రోజు కొనసాగిన ప్రజా చైతన్య యాత్ర**

**మహేశ్వరం, ఆగస్టు 26 వార్త వేదిక సూర్య**
ప్రజా హక్కుల పరిరక్షణకు ఐక్య పోరాటాలు అవసరమని, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించడం అనివార్యమని సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అన్నారు. రంగారెడ్డి జిల్లా ప్రజా చైతన్య యాత్ర నాలుగో రోజు మంగళవారం మహేశ్వరం నియోజకవర్గ కేంద్రం, తుక్కుగూడ పట్టణాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడారు.

సామాన్యుడిపై భారాలు మోపుతున్న కేంద్రం

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల వల్ల సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పాలమాకుల జంగయ్య విమర్శించారు.

దేశ ప్రజల సంక్షేమం కోసం అధికారంలోకి వచ్చిన కేంద్ర ప్రభుత్వం నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించడంలో పూర్తిగా విఫలమైందని అన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల పెరుగుదలతో రవాణా ఖర్చులు పెరిగి, దాని ప్రభావం ప్రతి పేద, మధ్యతరగతి కుటుంబంపై పడుతోందన్నారు.

ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించడం, కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా విధానాలు రూపొందించడం ద్వారా దేశ సంపదను కొద్దిమంది చేతుల్లోకి కేంద్రీకరిస్తున్నారని ఆరోపించారు.

తెలంగాణకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయి?



ఉపాధి అవకాశాలు పెంచుతామని చెప్పిన కేంద్రం యువతకు స్థిరమైన ఉద్యోగాలు కల్పించడంలో ఎందుకు విఫలమైందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణకు ఇచ్చిన హామీలు, నిధులు, ప్రాజెక్టుల విషయంలో కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన సమాధానం ఇవ్వాలని అన్నారు. ప్రజల సమస్యలను పట్టించుకోకుండా రాజకీయ ప్రచారానికే ప్రాధాన్యత ఇవ్వడం సరికాదన్నారు.

ప్రజా సమస్యలపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడమే ప్రజా చైతన్య యాత్ర లక్ష్యమని, కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. "బీజేపీ సర్కార్ కు బదలానా జరూరీ హై" అని నినదించారు. ఈ బస్సు యాత్రలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్రచారి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బీ. దత్తు నాయక్, జిల్లా కార్యదర్శి బుద్ధుల జంగయ్య, జిల్లా కార్యదర్శి ప్రభులింగం, జిల్లా కార్యదర్శి పి. శివకుమార్, జిల్లా కార్యదర్శి సామిడి వంశీ వర్ధన్ రెడ్డి, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు సుధాకర్, పల్నాటి యాదయ్య, పి. దేవేంద్ర గౌడ్, మండల సహాయ బ్రహ్మాచారి, రమేష్, ఎన్. యాదగిరి, పి. యాదయ్య, కె. రాజు తదితర ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## పాఠశాలకు నేడు సెలవు

**- రూపా రెడ్డి హత్యకు నిరసనగా బంద్ --**

**శనివారం నుంచి యథావిధిగా తరగతులు**

**రాజేంద్రనగర్, ఆగస్టు 20 ( వార్త వేదిక సూర్య ) :**
రూపా రెడ్డి దారుణ హత్యకు నిరసనగా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ షబ్బీర్ అలీ పిలుపునిచ్చిన బంద్, ఆందోళన కార్యక్రమాల నేపథ్యంలో పాఠశాలకు శుక్రవారం సెలవు ప్రకటించినట్లు పాఠశాల యాజమాన్యం తెలిపింది. బంద్ నేపథ్యంలో నేడు పాఠశాలను మూసివేస్తున్నట్లు పేర్కొంది. విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ విషయాన్ని గమనించాలని సూచించింది. శనివారం నుంచి పాఠశాలలో తరగతులు యథావిధిగా కొనసాగుతాయని పాఠశాల యాజమాన్యం వెల్లడించింది.



# నల్లగొండ

## గురుకుల జూనియర్ కళాశాలల్లో స్పాట్ అడ్మిషన్లు

**22న స్పాట్ అడ్మిషన్ కౌన్సెలింగ్**

**- రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, వికారాబాద్ జిల్లాల్లో ఖాళీ సీట్ల భర్తీ**

**రాజేంద్రనగర్, ఆగస్టు 20 ( వార్త వేదిక సూర్య ) :**
మహాత్మా జ్యోతిబా ఫూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ పరిధిలోనిరంగారెడ్డి,మేడ్చల్-మల్కాజిగిరి, వికారాబాద్ జిల్లాల్లోని గురుకుల జూనియర్ కళాశాలల బాలుర విభాగంలో మిగిలిన సీట్లను భర్తీ చేసేందుకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ, హెచ్ఈసీ, ఒకేషనల్ గ్రూపు (సీజీఏ)లో సీట్ల లభ్యతను బట్టి అర్హులైన విద్యార్థులకు ముందుగా వచ్చిన వారికి ముందుగా అవకాశం కల్పిస్తారు.అర్హతలు : ఎంపీసీ, బైపీసీ గ్రూపులకు ఎస్ఎస్‌సీలో 400 మార్కులు లేదా అంతకంటే ఎక్కువ సాధించిన విద్యార్థులు అర్హులు. సీఈసీ, ఎంఈసీ, హెచ్ఈసీ, సీజీఏ గ్రూపులకు 380 మార్కులు లేదా అంతకంటే ఎక్కువ సాధించిన విద్యార్థులు మార్కుల మెరిట్ ఆధారంగా అర్హత పొందుతారు. ఈ స్పాట్ అడ్మిషన్లు 2026లో పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు మాత్రమే వర్తిస్తాయి. ఎస్ఎస్‌సీ-2026 రెగ్యులర్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థులను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటారు. సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను పరిగణనలోకి తీసుకోరు. స్పాట్ అడ్మిషన్ తేదీ: ఆగస్టు 22, శనివారం : మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా: పవర్ గ్రిడ్ రోడ్, ఘనాపూర్, ఘట్‌కేసర్, సింగపూర్ టౌన్‌షిప్ పోస్టు--500088. ఫోన్: 7993456674, 9154102754, 9154102750.రంగారెడ్డి జిల్లా: ఆర్‌సీఓ కార్యాలయం, మహేశ్వరం గేట్, తుక్కుగూడ మీదుగా, మహేశ్వరం మండలం, మంకాల్ పోస్టు. ఫోన్: 8465806380, 7702050176, 7981172918.వికారాబాద్ జిల్లా: మహీంద్రా ట్రాక్టర్ షోరూమ్ పక్కన, సయ్యద్ మల్కాపూర్ గ్రామం, పరిగి మండలం, వికారాబాద్‌జిల్లా--501501. ఫోన్: 9154102728, 9121107771, 7993456658. పై మూడు కేంద్రాల్లో జిల్లాల వారీగా స్పాట్ అడ్మిషన్ కౌన్సెలింగ్‌నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు. అర్హులైన విద్యార్థులు అవసరమైన ధ్రువ పత్రాలతో నిర్ణీత తేదీన సంబంధిత కేంద్రాలకు హాజరై అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.

## వరలక్ష్మీ వ్రతం ఎందుకు చేస్తారు? వ్రత విధానం ఏమిటి?

**- సిరిసంపదలు, సౌభాగ్యం, ఆయురారోగ్యాల కోసం భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం**

**రాజేంద్రనగర్, ఆగస్టు 20 ( వార్త వేదిక సూర్య ) :**
శ్రావణ మాసంలో అత్యంత పవిత్రమైన పర్వదినాల్లో వరలక్ష్మీ వ్రతానికి విశిష్ట స్థానం ఉంది. శ్రావణ మాసంలో పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం రోజున మహిళలు ముఖ్యంగా ఈ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో ఆచరిస్తారు. శ్రీ వరలక్ష్మీదేవి అనుగ్రహంతో కుటుంబంలో సుఖశాంతులు, సిరిసంపదలు, ఆయురారోగ్యాలు, సౌభాగ్యం కలగాలని కోరుకుంటూ ఈ వ్రతాన్ని నిర్వహిస్తారు.వరాలను ప్రసాదించే లక్ష్మీదేవి స్వరూపంగా వరలక్ష్మీదేవిని భావిస్తారు. కుటుంబ సభ్యుల క్షేమం, భర్తకు దీర్ఘాయుష్షు, సంతానం అభివృద్ధి, కుటుంబంలో శాంతి, సంతోషం, ఐశ్వర్యం కలగాలని మహిళలు ఈ వ్రతాన్ని ఆచరించడం ఆనవాయితీగా వస్తోంది. పురాణ కథనం ప్రకారం చారుమతి అనే స్త్రీ భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించగా లక్ష్మీదేవి ప్రత్యక్షమై వరాలు ప్రసాదించిందని చెబుతారు.వ్రత విధానం వరలక్ష్మీ వ్రతం రోజున ఇంటిని శుభ్రం చేసి పూజా స్థలాన్ని పూలు, ముగ్గులు, మామిడి ఆకుల తోరణాలతో అలంకరిస్తారు. ముందుగా గణపతిని పూజించి అనంతరం కలశాన్ని ఏర్పాటు చేస్తారు. కలశంలో పవిత్ర జలం, అక్షింతలు, నాణేలు తదితరాలను ఉంచి మామిడి ఆకులు, కొబ్బరికాయతో అలంకరిస్తారు. కలశాన్ని వరలక్ష్మీదేవి స్వరూపంగా భావించి పూజిస్తారు..అమ్మవారిని పసుపు, కుంకుమ, పూలు, వస్త్రాలు, ఆభరణాలతో అలంకరించి షోడశోపచార పూజ నిర్వహిస్తారు. వరలక్ష్మీ అష్టోత్తర శతనామావళిని పఠించి, వ్రత కథను చదివి లేదా విని కుటుంబ సభ్యుల క్షేమం కోసం ప్రార్థిస్తారు. పాయసం, పులిహోర, బూరెలు, పూర్ణాలు, పండ్లు తదితర నైవేద్యాలను సమర్పిస్తారు. పూజ అనంతరం ముత్తైదువులకు పసుపు, కుంకుమ, పూలు, తాంబూలం, పండ్లు తదితరాలను వాయనంగా అందిస్తారు. పూజలో ఉంచిన పవిత్ర తోరాన్ని మహిళలు చేతికి కట్టుకుని అమ్మవారి ఆశీస్సులు పొందుతారు. చివరగా హారతి ఇచ్చి తీర్థప్రసాదాలను స్వీకరించడంతో పూజా కార్యక్రమం ముగుస్తుంది. వరలక్ష్మీ వ్రతం సందర్భంగా ప్రతి ఇంటా సుఖశాంతులు, సిరిసంపదలు, ఆయురారోగ్యాలు వెల్లివిరియాలని, కుటుంబాలన్నీ సౌభాగ్యంతో వర్ధిల్లాలని భక్తులు ఆకాంక్షిస్తున్నారు. శ్రీ వరలక్ష్మీదేవి కృపతో ప్రజలందరి జీవితాల్లో ఆనందం, ఐశ్వర్యం నిండాలని ప్రార్థిస్తున్నారు.

## సిసి రోడ్ పనులను పరిశీలించిన బిఆర్ఎస్ నాయకురాలు - మురారి స్మితా కోటేశ్ గౌడ్

**సికింద్రాబాద్, ఆగస్టు 20(వార్త వేదిక సూర్య)**
తార్నాక డివిజన్ గోకుల్ నగర్ లో జరుగుతున్న సిసి రోడ్ పనులను గురువారం బిఆర్ఎస్ పార్టీ సీనియర్ మహిళ నాయకురాలు మురారి స్మితా కోటేశ్ గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... స్థానికులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పనులను వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశించారు అదేవిధంగా పనుల్లో నాణ్యతమైన విషయంలో రాజీపడకూడదని పేర్కొన్నారు.

## ఘనంగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు షేక్ అక్తర్ జన్మదిన వేడుకలు

**సికింద్రాబాద్ ఆగస్టు 20(వార్త వేదిక సూర్య)**
సోమాజిగూడ డివిజన్ మాజీ కార్పొరేటర్ వనం సంగీత శ్రీనివాస్ యాదవ్ కార్యాలయంలో గురువారం కాంగ్రెస్ సీనియర్ నాయకులు షేక్ అక్తర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ వనం సంగీత శ్రీనివాస్ యాదవ్ షేక్ అక్తర్‌ను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వనం సంగీత శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ, షేక్ అక్తర్ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవిస్తూ, ప్రజాసేవలో మరింతగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో మరెన్నో జన్మదిన వేడుకలు జరుపుకోవాలని కోరుకుంటూ శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పిల్లి నాగరాజు, తౌఫైల్, ఖాసిం తదితరులు పాల్గొన్నారు.

## చిట్టెంపహాడ్ ప్రాథమిక పాఠశాలకు అదనపు ఉపాధ్యాయుడిని నియమించాలి

**-BJYM మండల అధ్యక్షులు నాంపల్లి సతీష్**

**నాంపల్లి ఆగస్టు 20(వార్త వేదిక సూర్య)**
నల్గొండ జిల్లా నాంపల్లి మండలంలోని చిట్టెంపహాడ్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయుల కొరత ఉందని, వెంటనే అదనపు ఉపాధ్యాయుడిని నియమించాలని మండల విద్యాధికారికి వినతిపత్రం అందజేసిన దీజేవీ మండల అధ్యక్షులు నాంపల్లి సతీష్. ఈ సందర్భంగా నాంపల్లి సతీష్ మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు సరిపడా ఉపాధ్యాయులు లేకపోవడం వల్ల విద్యార్థుల విద్యాభ్యాసానికి ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు అవసరమైన మేరకు ఉపాధ్యాయులను అందుబాటులో ఉంచడం విద్యాశాఖ బాధ్యత అని పేర్కొన్నారు.నాంపల్లి మండలంలో గానీ,నల్లగొండ జిల్లాలోని ఇతర పాఠశాలల్లో గానీ విద్యార్థుల సంఖ్యతో పోలిస్తే అదనంగా ఉపాధ్యాయులు ఉన్న పాఠశాలలను గుర్తించి,అవసరమైన చోట్లకు సర్దుబాటు చేయాలని కోరారు.అందులో భాగంగా చిట్టెంపహాడ్ ప్రాథమిక పాఠశాలకు వెంటనే ఒక ఉపాధ్యాయుడిని కేటాయించి విద్యార్థుల విద్యకు ఎలాంటి ఆటంకం లేకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని విద్యాశాఖ అధికారులు తక్షణమే స్పందించి చిట్టెంపహాడ్ పాఠశాలలో ఉపాధ్యాయుడిని నియమించాలని నాంపల్లి సతీష్ డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మండల ప్రధానకార్యదర్శి పొలగోని శ్రీకాంత్, సుంకరి శంకర్, మరేపాకుల శివ, నాంపల్లి శంకర్, నాంపల్లి శివ తదితరులు పాల్గొన్నారు

www.vaarthavedhikasurya.com
వార్త వేదిక సూర్య
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY
సంపుటి : 2
సంచిక : 93
శుక్రవారం
21 ఆగష్టు 2026

## పట్టణ,బస్తీ దవాఖానాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్

**నాగర్ కర్నూల్ ఆగస్టు 20 ( వార్త వేదిక సూర్య ) :**

నాగర్‌కర్నూల్ పట్టణ పరిధిలోని 18వ వార్డు శ్రీనగర్ కాలనీ, 3వ వార్డు దేశిటిక్యాలలో నిర్వహిస్తున్న పట్టణ, బస్తీ దవాఖానాలను జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ గురువారం ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బస్తీ దవాఖానాల్లో కొనసాగుతున్న వైద్య సేవలను కలెక్టర్ పరిశీలించారు. వైద్య సిబ్బంది హాజరు, దవాఖానాల నిర్వహణ, రోగులకు అందిస్తున్న చికిత్స, మందుల లభ్యత తదితర అంశాలపై సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. ప్రతిరోజూ ఎంతమంది రోగులు దవాఖానాలకు వస్తున్నారు, స్థానిక ప్రజలు బస్తీ దవాఖానాల సేవలను ఎంత మేరకు వినియోగించుకుంటున్నారు, రోగులకు అవసరమైన వైద్య పరీక్షలు, మందులు అందుతున్నాయా అనే విషయాలపై ఆరా తీశారు. దవాఖానకు వచ్చిన రోగులతో కలెక్టర్ నేరుగా మాట్లాడి వారి ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బస్తీ దవాఖానాల్లో అందుతున్న వైద్య సేవలు, వైద్యుల అందుబాటు, ఇస్తున్న మందులపై రోగుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. వైద్యం అందించడంలో ఎదురవుతున్న ఇబ్బందులు ఏమైనా ఉన్నాయా అనే విషయాలను కూడా అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు సమీపంలోనే మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానాలను సక్రమంగా నిర్వహించాలని, దవాఖానకు వచ్చే ప్రతి రోగికి సకాలంలో వైద్యం అందేలా వైద్య సిబ్బంది బాధ్యతగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. ప్రజలకు ప్రభుత్వ వైద్య సేవలు మరింత చేరువయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వైద్య సిబ్బంది సమయానికి అందుబాటులో ఉండటంతో పాటు రోగులకు అవసరమైన ఆరోగ్య సలహాలు, సూచనలు అందించాలని కలెక్టర్ తెలిపారు. ప్రజల ఆరోగ్య సమస్యలను ఓపికగా విని, వారికి అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి తగిన చికిత్స అందించాలని సూచించారు. బస్తీ దవాఖానాల ద్వారా స్థానిక ప్రజలకు ప్రాథమిక వైద్యం, అవసరమైన మందులు సులభంగా అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, దవాఖానాల నిర్వహణలో నిర్లక్ష్యం లేకుండా, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా సిబ్బంది కృషి చేయాలని స్పష్టం చేశారు.

## డీ-8 కెనాల్ పరిధిలో పర్యటించిన మంత్రి జూపల్లి,

### కాల్వలపై అధికారులు నిరంతరం పర్యవేక్షించాలి

**నాగర్ కర్నూల్ ఆగస్టు 20 ( వార్త వేదిక సూర్య ) :**



కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన డీ-8 కెనాల్ పరిధిలోని కాల్వలను పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు బైక్‌పై తిరుగుతూ స్వయంగా పరిశీలించారు. తూడుకుర్తి దగ్గర ప్రధాన కాల్వ నుండి సాకర్‌పల్లి, ఏదుట్ల, గోపాలపేట, రేమద్దుల, సింగాయిపల్లి, తురకపల్లి, గోపులపురం కాల్వలను పరిశీలించి నీటి ప్రవాహం, కాల్వల పరిస్థితిని పర్యవేక్షించారు. కాల్వలు, డిస్ట్రిబ్యూటరీలకు విడుదల చేస్తున్న నీరు, ఆయకట్టు పరిస్థితిపై సాగునీటిపారుదల శాఖ అధికారులను మంత్రి ఆరా తీశారు. ఆయకట్టు చివరి భూముల వరకు సాగునీరు చేరుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో ప్రతి నీటి బొట్టునూ ఒడిసిపట్టుకోవాలని మంత్రి సూచించారు. నీటిని ఏమాత్రం వృథా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని స్పష్టం చేశారు. అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగిస్తూ అధిక విస్తీర్ణంలో పంటలకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కాల్వలు, డిస్ట్రిబ్యూటరీలకు నీటి విడుదల, నీటి ప్రవాహం, ఆయకట్టు పరిస్థితిపై సాగునీటిపారుదల శాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని మంత్రి ఆదేశించారు. నీరు వృథా కాకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవడంతో పాటు, ఆయకట్టు చివరి భూములకు సైతం సక్రమంగా నీరు అందేలా చూడాలని సూచించారు. మంత్రి వెంట వనపర్తి జిల్లా గ్రంథాలయ చైర్మన్ గోవర్ధన్ , కోడేరు మాజీ ఎంపీపీ రామ్మోహన్ రావు, సాగునీటిపారుదల శాఖ అధికారులు, తదితరులు ఉన్నారు.

## రాజీవ్ గాంధీ సేవలు చిరస్మరణీయం

### మహబూబ్‌నగర్‌లో ఘనంగా 82వ జయంతి వేడుకలు..

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 20(వార్త వేదిక సూర్య ):**



మాజీ ప్రధానమంత్రి, భారతరత్న స్వర్గీయ శ్రీ రాజీవ్ గాంధీ 82వ జయంతి సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని అశోక్ టాకీస్ చౌరస్తాలో ఉన్న ఆయన విగ్రహానికి టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏపి మిథున్ రెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం డీసీసీ కార్యాలయంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేశ నిర్మాణంలో రాజీవ్ గాంధీ చేసిన సేవలను నాయకులు స్మరించుకున్నారు. యువతకు ప్రాధాన్యత కల్పించడంతో పాటు సాంకేతిక రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టి, ఆధునిక భారత నిర్మాణానికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని మిథున్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్, మేయర్ గుమ్మల మమత శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత మధుసూదన్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ కుమార్ గౌడ్, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం జిల్లా అధ్యక్షులు గోనాల శ్రీనివాస్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వినోద్ కుమార్, డీసీసీ ఉపాధ్యక్షులు బెక్కరి మధుసూదన్ రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి జహీర్ అక్తర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే డీసీసీ జనరల్ సెక్రటరీలు, మీడియా సెల్ సభ్యులు, కార్పొరేటర్లు, మండల అధ్యక్షులు, కాంగ్రెస్ అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, డీసీసీ కమిటీ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**నాగర్ కర్నూల్ ఆగస్టు 20 ( వార్త వేదిక సూర్య ) :**

నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీ పరిధిలోని నాగనూల్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఏ. రమేష్‌కుమార్‌తో కలిసి పాఠశాలను సందర్శించిన కలెక్టర్ విద్యార్థినుల హాజరు, విద్యాబోధన, పరిశుభ్రత, తాగునీటి వసతి, స్టోర్‌రూమ్, వంటగది, భోజన నాణ్యత తదితర అంశాలను పరిశీలించారు.

పాఠశాల హాజరు రిజిస్టర్లను పరిశీలించిన కలెక్టర్.... 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు మొత్తం 317 మంది విద్యార్థినులు నమోదై ఉండగా, గురువారం 229 మంది మాత్రమే హాజరైనట్లు గుర్తించారు. గైర్హాజరైన విద్యార్థినుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో 100 శాతం హాజరు ఉండేలా చర్యలు తీసుకోవాలని కేజీబీవీ ప్రత్యేక అధికారిని ఆదేశించారు. తరచూ గైర్హాజరవుతున్న విద్యార్థినులను గుర్తించి కారణాలు తెలుసుకోవాలని, అవసరమైతే తల్లిదండ్రులతో మాట్లాడి వారు క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చేలా చూడాలని సూచించారు.

ఆరోగ్య సమస్యల కారణంగా దీర్ఘకాలంగా గైర్హాజరవుతున్న విద్యార్థినులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, విద్యార్థినులు నిరంతరం పాఠశాలకు హాజరైతేనే విద్యలో మెరుగైన ఫలితాలు సాధించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

అనంతరం పాఠశాల పరిసరాలను పరిశీలించిన కలెక్టర్ తరగతి గదులు, విద్యార్థినులు చదువుకునే ప్రదేశాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, పరిశుభ్రమైన, ఆహ్లాదకరమైన వాతావరణం విద్యార్థినుల ఆరోగ్యంతో పాటు చదువుపై కూడా సానుకూల ప్రభావం చూపుతుందని తెలిపారు.

స్టోర్‌రూమ్‌ను పరిశీలించి అక్కడ నిల్వ ఉన్న సరుకులు, నిత్యావసర వస్తువుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వస్తువులను సక్రమంగా భద్రపరచడంతో పాటు స్టాక్ వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని, సంబంధిత రికార్డులను పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు.

పాఠశాలలోని ఆర్వో ప్లాంట్‌ను పరిశీలించిన సందర్భంగా లీకేజీని గుర్తించిన కలెక్టర్ తాగునీటి విషయంలో విద్యార్థినులకు ఇబ్బందులు కలగకుండా దానిని వెంటనే సరిచేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఏ. రమేష్‌కుమార్ ను ఆదేశించారు. పాఠశాలలో అవసరమైన చిన్నచిన్న మరమ్మతు పనులను కూడా ఆలస్యం చేయకుండా పూర్తి చేయాలని, మౌలిక వసతుల విషయంలో నిర్లక్ష్యం వహించరాదని స్పష్టం చేశారు.

వంటగదిని పరిశీలించిన కలెక్టర్ వంటగది పరిశుభ్రత, వంటకు ఉపయోగిస్తున్న సరుకులు, వాటి నిల్వ విధానాన్ని పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా, నిర్ణీత సమయానికి భోజనం పెడుతున్నారా అనే విషయాలను విద్యార్థినులను



నేరుగా అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన, పరిశుభ్రమైన, పౌష్టికాహారంతో కూడిన భోజనం అందించాలని, వంట సమయంలో పరిశుభ్రత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు.

తనిఖీలో భాగంగా పదో తరగతి తరగతి గదికి వెళ్లిన కలెక్టర్ విద్యార్థినులతో ముచ్చటించారు. వారి చదువు, పాఠ్యాంశాలపై అవగాహన, గేఉపాధ్యాయుల బోధన, పరీక్షలకు సిద్ధమవుతున్న తీరుపై ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులు తమ చదువు, భవిష్యత్ లక్ష్యాలను కలెక్టర్‌తో పంచుకున్నారు.

ఈ సందర్భంగా పదో తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించేందుకు ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా చదవాలని కలెక్టర్ సూచించారు. ప్రతిరోజూ తరగతిలో బోధించిన పాఠాలను పునశ్చరణ చేసుకోవాలని, అర్థం కాని అంశాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోవాలని తెలిపారు. పరీక్షలను భయపడకుండా ఆత్మవిశ్వాసంతో ఎదుర్కోవాలని సూచించారు. చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరచాలని, ఆసక్తి ఉన్న రంగాన్ని ఎంచుకుని ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని వాటిని సాధించేందుకు కష్టపడాలని విద్యార్థినులను ప్రోత్సహించారు.

ప్రతి విద్యార్థినిలోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. విద్యార్థినుల సామర్థ్యానికి అనుగుణంగా అవసరమైన మార్గదర్శకత్వం అందించాలని సూచించారు.

కేజీబీవీలో ఇంటర్మీడియట్ విద్యార్థినుల కోసం నిర్మిస్తున్న అదనపు తరగతి గదుల పనులను కూడా కలెక్టర్ పరిశీలించారు. నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి విద్యార్థినులకు అందుబాటులోకి తీసుకురావాలని, నిర్మాణ పనుల వల్ల విద్యార్థినుల విద్యాభ్యాసానికి ఎలాంటి అంతరాయం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, తరగతి గదుల కొరత లేకుండా చూడడంతో పాటు మిగిలిన పనులను నాణ్యతతో, వేగంగా పూర్తి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారిని ఆదేశించారు.

కలెక్టర్ వెంట నాగర్‌కర్నూల్ మండల విద్యాధికారి కురుమయ్య, ఇన్‌చార్జి జీసీడీఓ నిర్మల, కేజీబీవీ ప్రత్యేక అధికారి స్వప్న, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## రైల్వే అభివృద్ధి పనుల వేగం పెంచండి

### కొవిడ్ సమయంలో తొలగించిన రైలు స్టాప్‌లను పునరుద్ధరించాలి : ఎంపీ డీకే అరుణ

**మహబూబ్ నగర్ బ్యూరో, ఆగస్టు 20 (వార్త వేదిక సూర్య ):**



రైల్వే అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ రైల్వే ఉన్నతాధికారులను కోరారు. సికింద్రాబాద్ రైల్ నిలయంలో తెలంగాణ పార్లమెంట్ సభ్యులతో జరిగిన రైల్వే అధికారుల సమావేశంలో ఆమె ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని రైల్వే ప్రాజెక్టుల పురోగతిపై అధికారులతో సమీక్షించారు.

గత సమావేశాల్లో ప్రతిపాదించిన పనుల్లో ఎన్ని మంజూరయ్యాయి, ఏ దశలో ఉన్నాయి, కేంద్ర రైల్వే బోర్డుకు పంపిన ప్రతిపాదనల పరిస్థితి ఏమిటనే అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ పనులను త్వరితగతిన ముందుకు తీసుకెళ్లాలని సూచించారు.

**అమృత్ భారత్ స్టేషన్ పనులు..**

షాద్‌నగర్, జడ్చర్ల, మహబూబ్‌నగర్, జోగులాంబ గద్వాల రైల్వే స్టేషన్లలో అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద అభివృద్ధి, మౌలిక వసతుల పనులు కొనసాగుతున్నాయి. జోగులాంబ గద్వాల స్టేషన్ పనులు పూర్తై ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని అధికారులు తెలిపారు. షాద్‌నగర్, జడ్చర్ల స్టేషన్ల పనులు 2027 మార్చి, మహబూబ్‌నగర్ స్టేషన్ జూన్ 2027, గద్వాల స్టేషన్ ఏప్రిల్ 2027 నాటికి పూర్తిచేయనున్నట్లు వెల్లడించారు.

**అర్ ఓ బి , ఎల్ ఎచ్ ఎస్ పనులపై సమీక్ష..**

మహబూబ్‌నగర్ పట్టణంలోని టీడీగుట్ట అర్ ఓ బి కు మంజూరు లభించిందని, భూసేకరణ పూర్తయిన వెంటనే టెండర్లు పిలుస్తామని అధికారులు తెలిపారు. వీరన్నపేట, బోయపల్లి, తిమ్మసానిపల్లి అర్ ఓ బి లు, మోతీనగర్ ఎల్ ఎచ్ ఎస్ లకు ఫీజిబిలిటీ రిపోర్టులు వచ్చాయని, మంజూరు ప్రక్రియలో ఉన్నాయని వెల్లడించారు. దేవరకద్ర ఎల్ ఎచ్ ఎస్ కు మంజూరు లభించగా, సెప్టెంబర్‌లో టెండర్లు ఆహ్వానించనున్నట్లు తెలిపారు. వనపర్తి స్టేషన్ రోడ్డులో అర్ ఓ బి కు, శ్రీరామ్‌నగర్‌లో అర్ ఓ బి ప్రతిపాదనకు కూడా మంజూరు లభించిందని అధికారులు వివరించారు.

అర్ ఓ బి , అర్ యూ బి పనులకు గతంలో కేంద్రం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు సమకూర్చేవని, రాష్ట్ర వాటా నిధుల కారణంగా పనుల్లో జాప్యం జరిగేదని ఎంపీ పేర్కొన్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం 100 శాతం నిధులు అందజేస్తుండటంతో పనులు వేగంగా పూర్తయ్యే అవకాశం ఉందన్నారు.

**రైలు స్టాప్‌ల పునరుద్ధరణకు విజ్ఞప్తి...**

కొవిడ్ సమయంలో వనపర్తి, మక్తల్, కృష్ణా, గద్వాల ప్రాంతాల్లో తొలగించిన రైలు స్టాప్‌లను ప్రజల విజ్ఞప్తుల మేరకు పునరుద్ధరించాలని డీకే అరుణ కోరారు. సికింద్రాబాద్--రాయచూర్ రైలు సమయాన్ని మార్చాలని కోరగా, టైమింగ్ మార్పులో ఇబ్బందులు ఉన్నందున కొత్త రైలు కోసం ప్రతిపాదనలు పంపుతున్నట్లు అధికారులు తెలిపారు.

అలాగే కృష్ణా--వికారాబాద్ రైల్వే లైన్‌కు డీపీఅర్ పూర్తయిందని, పనులు త్వరగా ప్రారంభించాలని ఎంపీ కోరారు. గద్వాల--డోర్నకల్ కొత్త రైల్వే లైన్ డీపీఅర్ కూడా పూర్తయిందని తెలిపారు. ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న గద్వాల--మాచర్ల రైల్వే లైన్‌తో పాటు జడ్చర్ల--మిర్యాలగూడ, వికారాబాద్--తాండూరు కొత్త రైల్వే లైన్లను కూడా పరిశీలించాలని అధికారులను కోరారు.

**మలక్‌పేట్‌లో హంద్రి ఎక్స్‌ప్రెస్‌కు స్టాప్...**

ఎంపీ డీకే అరుణ విజ్ఞప్తి మేరకు హైదరాబాద్ డెక్కన్ (నాంపల్లి)--కర్నూల్ హంద్రి ఎక్స్‌ప్రెస్ (17027/17028)కు మలక్‌పేట్ (హైదరాబాద్) రైల్వే స్టేషన్‌లో స్టాప్ కల్పించేందుకు రైల్వే అధికారులు అంగీకరించారు.

మహబూబ్‌నగర్ టౌన్‌లో రెండో రైల్వే లైన్ కోసం మూడు ప్రాంతాల్లో భూసేకరణ జరుగుతున్న నేపథ్యంలో, అక్కడి నివాసితులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఎంపీ, భూసేకరణ ప్రక్రియను ఆలస్యం చేయకుండా పూర్తి చేయాలని కోరారు. గద్వాలలో రెండో లైన్ పనులకు కూడా మంజూరు లభించిందని, త్వరలో పనులు ప్రారంభమవుతాయని అధికారులు వెల్లడించారు. మరికల్--ఇబ్రహీంపట్నం అర్ యూ బి లో వాటర్ లాగింగ్ సమస్యను కూడా ఎంపీ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

## నేర నియంత్రణ, కేసుల దర్యాప్తులో వేగం పెంచాలి..

### భూత్పూర్ సర్కిల్ వార్షిక తనిఖీలో జిల్లా ఎస్పీ డి.జానకి..

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 20 (వార్త వేదిక సూర్య ):**

నేర నియంత్రణతో పాటు పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, ప్రజలకు మరింత సమర్థవంతమైన పోలీస్ సేవలు అందించాలని జిల్లా ఎస్పీ డి.జానకి, అధికారులను ఆదేశించారు. గురువారం భూత్పూర్ సర్కిల్ కార్యాలయాన్ని వార్షిక తనిఖీలో భాగంగా పరిశీలించిన ఎస్పీ, సర్కిల్ పరిధిలోని పోలీస్ స్టేషన్ల పనితీరు, నేరాల పరిస్థితి, కేసుల దర్యాప్తు పురోగతిపై సమీక్ష నిర్వహించారు.

ఇన్‌స్పెక్టర్ స్థాయిలో దర్యాప్తు చేస్తున్న కేసులను పెండింగ్‌లో ఉంచకుండా త్వరితగతిన పూర్తి చేయాలని, నాణ్యమైన ఆధారాలతో కేసులను కోర్టులో సమర్థవంతంగా నిరూపించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రతి కేసు దర్యాప్తు పురోగతిని క్రమం తప్పకుండా సమీక్షించాలని ఆదేశించారు.

సర్కిల్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ల ఎస్ హెచ్ ఓ లతో క్రమం తప్పకుండా నేర సమీక్ష సమావేశాలు నిర్వహించి, నమోదవుతున్న నేరాలపై విశ్లేషణ చేయాలని తెలిపారు. నేరాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టడంతో పాటు పాత నేరస్తులు, రౌడీషీటర్లు, అనుమానితుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని సూచించారు.

పోలీస్ స్టేషన్లకు వచ్చే ఫిర్యాదుదారుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని, బాధితులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ ప్రజల్లో పోలీసులపై నమ్మకం పెరిగేలా ప్రజా అనుకూల పోలీసింగ్ కొనసాగించాలని ఎస్పీ సూచించారు.



మహిళలు, బాలల భద్రత, సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల నివారణ, రోడ్డు ప్రమాదాల నియంత్రణపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. జాతీయ రహదారులపై ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటూ భద్రతా చర్యలు చేపట్టాలని తెలిపారు.

భూత్పూర్ సర్కిల్ పరిధిలోని భూత్పూర్, మూసాపేట, అడ్డాకల్, దేవరకద్ర, సీసీకుంట పోలీస్ స్టేషన్ల పరిధిలో ఎన్ ఎచ్ -44, ఎన్ ఎచ్ -167 రహదారులు ఉన్నందున నేరాలు, రోడ్డు ప్రమాదాల నియంత్రణతో పాటు ట్రాఫిక్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ ఆదేశించారు.

బీట్ వ్యవస్థను మరింత బలోపేతం చేసి గ్రామాలు, కాలనీల్లో ప్రజలతో నిరంతరం మమేకమవుతూ వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించాలని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా పోలీసింగ్ నిర్వహించాలని సూచించారు. ఈ తనిఖీలో భూత్పూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, ఎస్ఐలు నాగన్న, విద్యా, మురళి, భాస్కర్ రెడ్డి తో పాటు ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.






## ఆధునిక భారత నిర్మాణంలో రాజీవ్ గాంధీది చెరగని ముద్ర..

### జిల్లావ్యాప్తంగా ఘనంగా మాజీ ప్రధాని జయంతి వేడుకలు..

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 20 (వార్త వేదిక సూర్య ):**

మాజీ ప్రధానమంత్రి, భారతరత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ 82వ జయంతి సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లావ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. జిల్లా కేంద్రంతో పాటు జడ్చర్ల, నవాబుపేట తదితర ప్రాంతాల్లో రాజీవ్ గాంధీ చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు.

జడ్చర్ల: జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని అంబేద్కర్ చౌరస్తా సిగ్నల్ గడ్డ వద్ద జడ్చర్ల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ దేశాన్ని ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన 21వ శతాబ్దపు దేశంగా తీర్చిదిద్దేందుకు రాజీవ్ గాంధీ చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు.

నవాబుపేట: మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తానం సురేష్ ఆధ్వర్యంలో జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఏఎంసి చైర్మన్ హర లింగం, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తానం సురేష్ మాట్లాడుతూ సాంకేతిక రంగం, టెలికమ్యూనికేషన్స్, విద్య, యువత, గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతం వంటి రంగాల్లో రాజీవ్ గాంధీ తీసుకున్న నిర్ణయాలు దేశ అభివృద్ధికి బలమైన పునాదులు వేశాయని పేర్కొన్నారు.

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో:

అశోక్ టాకీస్ చౌరస్తాలోని రాజీవ్ గాంధీ విగ్రహానికి టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏపి మిథున్ రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం డీసీసీ కార్యాలయంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. యువతకు ప్రాధాన్యత, సాంకేతిక రంగంలో విప్లవాత్మక మార్పులు, ఆధునిక భారత నిర్మాణం కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని నాయకులు పేర్కొన్నారు.

జిల్లాలోని వివిధ మండలాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, డీసీసీ కమిటీ సభ్యులు, మండల అధ్యక్షులు, అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పాల్గొని రాజీవ్ గాంధీ సేవలను స్మరించుకున్నారు.

యువతే దేశ భవిష్యత్తు..

అనే దృక్పథంతో రాజీవ్ గాంధీ చూపిన మార్గం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం ప్రతి ఒక్కరి బాధ్యత అని కాంగ్రెస్ నాయకులు అన్నారు.

## యువ భారతానికి రాజీవ్ గాంధీ స్ఫూర్తి..

### చౌడాపూర్‌లో ఘనంగా మాజీ ప్రధాని జయంతి వేడుకలు..

**మహబూబ్ నగర్ బ్యూరో, ఆగస్టు 20(వార్త వేదిక సూర్య ):**

భారత మాజీ ప్రధాని, భారతరత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా చౌడాపూర్ మండల కేంద్రంలోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు.

ఉమ్మడి కుల్కచర్ల--చౌడాపూర్ మండలాల పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఎల్పటి అశోక్ కుమార్, చౌడాపూర్ గ్రామ సర్పంచ్ నవీన్ కుమార్ తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఆధునిక భారతదేశ నిర్మాణంలో రాజీవ్ గాంధీ చేసిన కృషి ఎప్పటికీ మరువలేనిదని అన్నారు. సాంకేతిక రంగం, యువత, విద్య, గ్రామీణాభివృద్ధికి ఆయన అందించిన సేవలు యువ భారతానికి రాజీవ్ గాంధీ స్ఫూర్తి అని,దేశ ప్రగతికి బలమైన పునాదులు వేశాయని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఉప సర్పంచుల సంఘం అధ్యక్షులు గోపాల్ నాయక్, చౌడాపూర్ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు రాము, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సత్యకుమార్, గోపాల్, లింగం, చెవ్వ యాదయ్య, రాజు, కృష్ణయ్య, సంతోష్, ఇమ్రాన్, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

## 24 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఆటో బంద్..

### బంద్‌కు అధికారులు సహకరించాలి:

### కలెక్టర్‌కు ఆటో యూనియన్ల జేఏసీ వినతి..

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 20 (వార్త వేదిక సూర్య ):**



ఆటో, క్యాబ్ డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 24వ తేదీ నుంచి నిర్వహించనున్న రాష్ట్రవ్యాప్త ఆటోల బంద్‌కు అధికారులు సహకరించాలని కోరుతూ ఆటో యూనియన్ల జేఏసీ, సెంట్రల్ ట్రేడ్ యూనియన్ల నాయకులు గురువారం జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షులు రాములు యాదవ్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి, టీయూసీఐ జిల్లా కార్యదర్శి సాంబశివుడు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పి. సురేష్, ఐఎన్‌టీయూసీ జిల్లా కార్యదర్శి ఎం. రామ్మోహన్ కలెక్టర్‌ను కలిసి ఆటో కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.

**ప్రధాన డిమాండ్లు..**

ఆటో కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిన రూ.12 వేల ఆర్థిక సహాయాన్ని వెంటనే అందించాలి. ఆర్టీసీ యాజమాన్యం ఈ-ఆటోలను ప్రవేశపెట్టే ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోవాలి. ఆటో రవాణా రంగ కార్మికుల కోసం ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి. పెరిగిన ధరలకు అనుగుణంగా ఆటో చార్జీలను పెంచాలి. ఓలా, ఉబర్, ర్యాపిడోలకు ప్రత్యామ్నాయంగా ప్రభుత్వం ప్రత్యేక యాప్‌ను ఏర్పాటు చేయాలి. అనధికారికంగా యాప్‌ల ద్వారా నడుస్తున్న టూవీలర్లను నియంత్రించి ఆటో కార్మికుల ఉపాధిని కాపాడాలి. ఆటో కార్మికుల ప్రమాద బీమాను రూ.10 లక్షలకు పెంచడంతో పాటు సాధారణ మరణాలకు కూడా వర్తింపజేయాలి. ఆటో కార్మికుల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వినతిపత్రాలు పంపి చర్యలు తీసుకోవాలని నాయకులు కలెక్టర్‌ను కోరారు. ఈ నెల 24వ తేదీ నుంచి చేపట్టనున్న రాష్ట్రవ్యాప్త ఆటోల బంద్‌కు ప్రజలు, రవాణా శాఖ అధికారులు సహకరించాలని ఆటో యూనియన్ల జేఏసీ, ట్రేడ్ యూనియన్ నాయకులు విజ్ఞప్తి చేశారు.

www.vaarthavedikasurya.com
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY

# రాజీవ్ గాంధీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

- సొంత నిధులతో రాజీవ్ విగ్రహాన్ని ఏర్పాటు చేసిన ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య
- మోటకొండూరులో ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు
- నూతన అంగన్వాడీ భవనం ప్రారంభం, భారీ ర్యాలీ



**మోటకొండూరు, ఆగస్టు 20(వార్త వేధిక సూర్య):-** భారత మాజీ ప్రధాని, భారతరత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు మనం అర్పించే నిజమైన నివాళి అని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండల కేంద్రంలో గురువారం రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. రాజీవ్ గాంధీపై ఉన్న అపారమైన గౌరవంతో, తన సొంత నిధులతో ఏర్పాటు చేయించిన ఆయన నూతన విగ్రహాన్ని ఎమ్మెల్యే అయిలయ్య ఈ సందర్భంగా అధికారికంగా ఆవిష్కరించి, పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

**అభివృద్ధి పనుల ప్రారంభం.. భారీ ర్యాలీ..**

ఈ కార్యక్రమానికి ముందు మోటకొండూరులో నూతనంగా నిర్మించిన అంగన్వాడీ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలతో కలిసి అక్కడి నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం, నూతన రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా 'రాజీవ్ గాంధీ అమర్ రహే' అంటూ కార్యకర్తలు చేసిన నినాదాలతో హోరెత్తింది.

**నవ భారత నిర్మాత రాజీవ్ గాంధీ ..**

అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మాట్లాడుతూ.. దేశాన్ని సాంకేతికంగా, ఆధునికంగా అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడంలో రాజీవ్ గాంధీ చేసిన కృషి చారిత్రాత్మకమైనదని కొనియాడారు. రాజకీయాల్లో, పాలనలో యువతకు ప్రాధాన్యత కల్పించడం, ఐటీ రంగానికి బీజం వేయడం, గ్రామీణ అభివృద్ధి లాంటి ఎన్నో కీలక నిర్ణయాలతో ఆధునిక భారత దేశ నిర్మాణానికి ఆయన పునాదులు వేశారని గుర్తు చేశారు. ఆయన ఆలోచనలు, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలన్న తపన నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

**సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం**

కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ రైతులు, పేదలు, మహిళలు, యువత, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసమే నిరంతరం శ్రమిస్తుందని అయిలయ్య స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ అభివృద్ధికి, సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని తెలిపారు. ప్రజలకు విద్య, వైద్యం, గృహ నిర్మాణం, మహిళా సాధికారత తదితర రంగాల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ఈ సందర్భంగా ప్రజలకు వివరించారు. రాజీవ్ గాంధీ కలలుగన్న ఆధునిక భారతదేశం కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, యువజన, మహిళా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# యాదాద్రి భువనగిరి

## రాజీ ద్వారా పరిష్కారం.. సత్వర న్యాయం

- సెప్టెంబర్ 12న రామన్నపేట కోర్టుల్లో జాతీయ లోక్ అదాలత్




**రామన్నపేట ఆగస్టు 20 (వార్తా వేదిక సూర్య) :** పెండింగ్‌లో ఉన్న కేసులను రాజీ మార్గం ద్వారా పరిష్కరించి కక్షిదారులకు సత్వర న్యాయం అందించేందుకు సెప్టెంబర్ 12న రామన్నపేట కోర్టుల న్యాయ పరిధిలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు న్యాయాధికారులు తెలిపారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు, న్యాయవాదులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవా కమిటీ చైర్‌పర్సన్ జి. సబిత మాట్లాడుతూ రామన్నపేట కోర్టుల పరిధిలో రాజీ చేసుకునే అవకాశం ఉన్న వివిధ కేసులను ఇరుపక్షాల సమ్మతితో లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చని తెలిపారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న రాజీకి అవకాశం ఉన్న క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, కుటుంబ వివాదాలు, బ్యాంకింగ్, ఆర్థిక వివాదాలు, మోటార్ వాహన ప్రమాద పరిహారం కేసులు తదితర కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకునే అవకాశం ఉందన్నారు. లోక్ అదాలత్ ద్వారా కేసులను పరిష్కరించుకోవడం వల్ల కక్షిదారులకు సమయం, ఖర్చు ఆదా కావడంతో పాటు వివాదాలకు స్నేహపూర్వకంగా, త్వరితగతిన పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. కోర్టుల్లో ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న కేసులతో పాటు, లోక్ అదాలత్ పరిధిలో పరిష్కరించదగిన వివాదాలను కూడా సంబంధిత న్యాయవాదుల సహకారంతో పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఇరుపక్షాలు పరస్పర అంగీకారానికి రావడం ద్వారా న్యాయపరమైన ప్రక్రియను సులభతరం చేసుకోవచ్చని న్యాయాధికారులు సూచించారు. సెప్టెంబర్ 12న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌కు హాజరై తమ కేసులను రాజీ ద్వారా పరిష్కరించుకునే అవకాశాన్ని రామన్నపేట కోర్టుల న్యాయ పరిధిలోని కక్షిదారులు, న్యాయవాదులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

## దళిత యూత్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక





**మోత్కూరు, ఆగస్టు 20 ( వార్త వేదిక సూర్య):** మోత్కూరు మున్సిపల్ పరిధిలోని దళిత యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం నూతన అధ్యక్షులు కందుకూరి విజయ్ రువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యక్షుడిగా కందుకూరి నరేష్, ప్రధాన కార్యదర్శిగా పందుల సురేష్, సహాయ కార్యదర్శిగా బచ్చులకూరి స్వామి కోశాధికారిగా కందుకూరి స్వామి లను ఎన్నికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షులు విజయ్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు.

# పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలి

- సీపీఎం పాదయాత్రను జయప్రదం చేయాలి
- జిల్లా కార్యదర్శి ఎం.డి. జహంగీర్



**రామన్నపేట ఆగస్టు 20 (వార్తా వేదిక సూర్య ) :** యాదాద్రి భువనగిరి జిల్లాలో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సాగునీటి, తాగునీటి ప్రాజెక్టులకు తక్షణమే నిధులు కేటాయించి పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ఆధ్వర్యంలో ఈ నెల 29, 30, 31 తేదీల్లో భువనగిరి నుంచి హైదరాబాద్ ఇందిరాపార్క్ వరకు నిర్వహించే పాదయాత్రను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.డి. జహంగీర్ పిలుపునిచ్చారు. పాదయాత్రకు సంబంధించిన కరపత్రాలను రామన్నపేటలో సీపీఎం నాయకులతో కలిసి ఆవిష్కరించి ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం.డి. జహంగీర్ మాట్లాడుతూ యాదాద్రి భువనగిరి జిల్లా ఏర్పడి దశాబ్దం పూర్తవుతున్నప్పటికీ జిల్లాలో ఒక్క సాగునీటి ప్రాజెక్టు కూడా ఆశించిన స్థాయిలో పురోగతి సాధించకపోవడం పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. జిల్లాకు వ్యవసాయమే ప్రధాన జీవనాధారమని, లక్షలాది మంది చిన్న, సన్నకారు, మధ్యతరగతి రైతులు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. సాగునీటి వనరులు అందుబాటులో లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, మరో గత్యంతరం లేక మూసీ నది కలుషిత నీటిని పంటలకు వినియోగిస్తూ భూములు, పంటలు కలుషితం కావడంతో పాటు ప్రజలు అనారోగ్య సమస్యలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన పాలకులు ప్రజల గోడు పట్టించుకోకుండా తమ చేతగానితనాన్ని ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. జిల్లాకు సాగునీరు, తాగునీటి అవసరాలను తీర్చడంలో కీలకమైన బస్వాపూర్, గంధమల్ల, చర్లగూడెం తదితర ప్రాజెక్టులకు అవసరమైన నిధులు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. రామన్నపేట ప్రాం తానికి ఎంతో కీలకమైన ధర్మారెడ్డి, పిల్లాయిపల్లి కాలువల పనులు ఏళ్లు గడుస్తున్నా నత్తనడకన సాగుతు న్నాయని అన్నారు. బస్వాపూర్ రిజర్వాయర్ ద్వారా రామన్నపేట మండలానికి మూసీ నీటికి ప్రత్యామ్నాయంగా గోదావరి జలాల ను అందించి ప్రజారోగ్యాన్ని కాపాడాలని డిమాం డ్ చేశారు. అదేవిధంగా ఎంతో పురాతనమైన ఆసిఫ్‌నగర్ కాలువను పునరుద్ధరించాలని, అర్ధాం తరంగా నిలిచిపోయిన కాలువల పనులన్నింటినీ వెంటనే పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న అన్ని సాగునీటి ప్రాజెక్టులకు తక్షణమే నిధులు విడుదల చేసి, కాలపరిమితితో పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధన కోసం సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాదయాత్రకు రైతులు, వ్యవసాయ కార్మికులు, యువత, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మద్దతు ఇవ్వాలని, 29, 30, 31 తేదీల్లో భువనగిరి నుంచి ఇందిరాపార్క్ వరకు జరిగే పాదయాత్రను జయప్రదం చేయాలని ఎం.డి. జహంగీర్ కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జల్లెల పెంటయ్య, మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, జిల్లా కమిటి సభ్యులు వనం ఉపేందర్, మండల కార్యదర్శివర్గ సభ్యులు కల్లూరి నగేష్, మండల కమిటి సభ్యులు బాలరాజు, నాగటి ఉపేందర్, శ్రీనివాస్, నగేష్, నీల అయిలయ్య, పల్లె సత్యం, దండిగ నర్సింహా, సత్యం, శానగొండ వెంకటేశ్వర్లు, వళ్లమల్ల రమేష్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రిన్సిపాల్ రూపరెడ్డి హత్యకు నిరసనగా రేపు పాఠశాలల బంద్



**భువనగిరి టౌన్, ఆగస్టు 20 (వార్త వేదిక సూర్య):** ప్రిన్సిపాల్ రూపరెడ్డి హత్యను తీవ్రంగా ఖండిస్తూ మదర్ తెరిసా పాఠశాలలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల సిబ్బంది, విద్యార్థులు ఆమెకు సంతాపం తెలిపారు. ప్రిన్సిపాల్ రూపరెడ్డి హత్యకు పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మహిళలు, విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, సిబ్బందికి పూర్తి భద్రత కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా మదర్ తెరిసా పాఠశాల కరెస్పాండెంట్, ట్రస్మా జిల్లా నాయకులు సురేష్ మాట్లాడుతూ.. ప్రిన్సిపాల్ రూపరెడ్డి హత్య అత్యంత బాధాకరమైన ఘటన అని అన్నారు. ఘటనకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించి, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హత్యకు నిరసనగా ఆగస్టు 21న యాదాద్రి భువనగిరి జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రైవేట్ పాఠశాలలను బంద్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ బంద్‌కు అన్ని పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు, సిబ్బంది సహకరించాలని కోరారు

## బాధిత కుటుంబానికి రూ. 10,000 ఆర్థిక సాయం అందజేసిన యెల్లంల సంజీవరెడ్డి



**మోటకొండూరు /వార్తా వేదిక సూర్య:-** మండలంలోని చామపూర్ గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మామిడి మురళి కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు పరామర్శించారు. గురువారం రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే, యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బీర్ల అయిలయ్య, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఎల్లంల సంజీవరెడ్డి చామపూర్ గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను కలిశారు. మురళి మృతి పట్ల వారు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి అనారోగ్య సమస్యల గురించి అడిగి తెలుసుకొని వారిని ఓదార్చారు. ఈ కష్టకాలంలో మనోధైర్యం కోల్పోవద్దని, ఆ కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని బీర్ల అయిలయ్య ఈ సందర్భంగా వారికి భరోసా ఇచ్చారు. పార్టీ పక్షాన అన్ని విధాలుగా ఆదుకుంటామని ధైర్యం చెప్పారు. అనంతరం రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు ఎల్లంల సంజీవరెడ్డి మురళి కుటుంబ సభ్యులకు తన వంతుగా రూ. 10,000 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మోటకొండూరు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, చామపూర్ గ్రామ శాఖ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## భారత మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ జయంతి



**రామన్నపేట ఆగస్టు 20 (వార్తా వేదిక సూర్య) :** రామన్నపేట మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పున్న జగన్ మోహన్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వలిగొండ రామన్నపేట మార్కెట్ వైస్ చైర్మన్ సింగిరెడ్డి మల్లారెడ్డి రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ రాజీవ్ గాంధీ సేవలను కొనియాడారు. 18 సంవత్సరాలు నిండిన యువతకు ఓటు హక్కు కల్పించడం ద్వారా యువత రాజకీయ భాగస్వామ్యాన్ని పెంచిన చారిత్రాత్మక నిర్ణయం రాజీవ్ గాంధీ అని అన్నారు. రాజీవ్ గాంధీ గారి ఆశయాలకు అనుగుణంగా 18 సంవత్సరాలు నిండిన యువతి యువకుల ఓటరు నమోదును కార్యక్రమంను ఈ సందర్భంగా ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మొహమ్మద్ జమీరుద్దీన్ మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు కందిమల్ల గోపాల్ రెడ్డి రామన్నపేట ఉపసర్పంచ్ మోటే రమేష్ వనం చంద్రశేఖర్ సాల్వేర్ అశోక్ బొడ్డు సాలయ్య గుత్తా నర్సిరెడ్డి మొహమ్మద్ నాసర్ బండ అంజిరెడ్డి జిల్లా వెంకటేశం పిట్ట వెంకటరెడ్డి మహమ్మద్ అక్రమ్ కోట సుధాకర్ బత్తుల నవీన్ ఆముద లక్ష్మణ్ పున్న అమరేందర్ ఏ పరమేశ కొమ్ము రామస్వామి గొరిగే శేఖర్ బండ లింగస్వామి మోటే మహేష్ కేశవదాస్ వెంకటేష్ బొడ్డు శంకరయ్య ఎండి మన్సూర్ అలీ ఎండి అజార్ హరిబాబు కొండ శేఖర్ గౌడ్ మహమ్మద్ రిజ్వాన్ మిర్జా ఈనాయకుల బేగ్ చిత్రబోయిన నవీన్ గంగాపురం శంకర్ సహదేవ కక్కినేని రవీందర్ పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 9న చలో వరంగల్ ఎమ్మార్పీఎస్ జాతీయ మహా సభను విజయవంతం చేద్దాం

- అసమానతలు లేని సమాజాన్ని నిర్మిద్దాం
- యాదాద్రి భువనగిరి జిల్లా ఇంచార్జి బిర్రు బిర్రు మహేందర్ మాదిగ



**రామన్నపేట ఆగస్టు 20 (వార్తా వేదిక సూర్య ):** ,ఎమ్మార్పీఎస్ రామన్నపేట మండల ఇంచార్జ్ నల్ల స్వామి మాదిగ అధ్యక్షతన ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి రామన్నపేట మండల కమిటి సమావేశం రామన్నపేట మండల కేంద్రం ఎస్ వి ఆర్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించారు ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్ ఎం ఎస్ పి యాదాద్రి భువనగిరి జిల్లా ఇంచార్జ్ బిర్రు మహేందర్ మాదిగ , హాజరు మాట్లాడుతూ పద్మశ్రీ మందకృష్ణ మాదిగ గారి పిలుపుమేరకు సెప్టెంబర్ 9న వరంగల్లో జరగబోయే జాతీయ ఎంఆర్పిఎస్ ఎంఎస్పి నూతన మండల కమిటీ సదస్సును జయప్రదం చేయాలని పిలుపునివ్వడం జరిగింది అనంతరం ఎంఆర్పిఎస్ మండల కమిటీని ప్రకటించడం జరిగింది

**ఎమ్మార్పీఎస్ ఎం ఎస్ పి నూతన మండల కమిటీ**

ఎమ్మార్పీఎస్ అధ్యక్షులుగా నోముల చిరంజీవి మాదిగ, అధికార ప్రతినిధిగా మేడి కృష్ణ మాదిగ ఉపాధ్యక్షులు బందెల నరసింహులు మాదిగ ప్రధాన కార్యదర్శిగా కక్కిరేణి రవీందర్ మాదిగ కార్యదర్శిగా కొండగడప చింటూ మాదిగ బందెల వెంకన్న మాదిగ ఎం ఎస్ పి మండల అధ్యక్షులుగా, బొడ్డు శంకరయ్య మాదిగ అధికార ప్రతినిధిగా వంగాల మారయ్య మాదిగ ప్రధాన కార్యదర్శిగా మంటి మల్లేష్ మాదిగ యువసేన మండల అధ్యక్షులుగా మేడి నవీన్ మాదిగ ఈ మండలం నుండి జిల్లాకు వచ్చిన ఎం ఎస్ పి కి జిల్లా సీనియర్ నాయకులు దండోరా మల్లేష్ అన్న మాదిగ నల్ల స్వామి మాదిగ ఎమ్మార్పీఎస్ జిల్లా కమిటీ కి నోముల విష్ణు మాదిగ , లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. అనంతరం ఈ సమావేశన్నీ ఉద్దేశించి జిల్లా ఇంచార్జి బిర్రు మహేందర్ మాదిగ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ వర్గీకరణ ఫలాలు అందుకోవాలి సూచించారు, మాదిగ జాతి అన్ని రంగాల్లో ముందుకు తేవాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మశ్రీ మందకృష్ణమాదిగ 33సం" రాలుగా అహర్నిశలు శ్రమిస్తున్నారు .ఎమ్మార్పీఎస్ లక్ష్యం అసమానతలు లేని సమా జాన్ని నిర్మించడమేనని అన్నారు. మాదిగ జాతి హక్కులు కో సం ఆత్మగౌరం కోసం, శ్రమిస్తున్నారు ఆయన ఉద్యమానికి మద్దతుగా యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం నుంచి ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాలని కోరారు అలాగే సెప్టెంబర్ 9న వరంగల్ వేదికగా ఎమ్మార్పీఎస్ జాతీయ మహా సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు అనంతరం నూతన కార్యవర్గానికై నియామక పత్రాన్ని అం దించారు అనంతరం కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు మండల వ్యాప్తంగా అన్ని వర్గాలకు అండగా ఉండాలని కమిటి సభ్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో. ఎమ్మార్పీఎస్ యాదాద్రి భువనగిరి జిల్లా మాజీ అధ్యక్షులు భువనగిరి నియోజకవర్గం దుబ్బ రామకృష్ణ మాదిగ దళిత మోర్చా రాష్ట్ర నాయకులు నకిరె కంటి మొగులయ్య మాదిగ ఉద్యోగుల రాష్ట్ర నాయకులు బొడ్డు సురేందర్ మాదిగ ఉత్తటూరు గ్రామ సర్పంచ్ కోళ్ల రామకృష్ణ దుబ్బాక మాజీ సర్పంచ్ గట్టు యాదయ్య మాదిగ మంద చంద్రయ్య మాదిగ నోముల ప్రవీణ్ మాదిగ నోముల క్రిష్ణ మాదిగ అన్ని గ్రామాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

## బోనాల పండుగకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని కమిషనర్ కు వినతి



**యాధాద్రి భువనగిరి/వార్త వేధిక సూర్య :-** ఈనెల 22, 23న భువనగిరి పట్టణంలో ముదిరాజ్ ఇతర కులస్తుల బోనాల పండుగ సందర్భంగా వార్డులలోని దేవాలయాలలో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని భువనగిరి మున్సిపల్ కమిషనర్ చంద్రప్రకాష్ రెడ్డికి ముదిరాజ్ కుల సంఘం ఆధ్వర్యంలో గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 22న శనివారం పెద్దమ్మ తల్లి బోనాల సందర్భంగా కిసాన్ నగర్ లోని పెద్దమ్మ తల్లి ఆలయం వద్ద భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని కోరారు. 23న ఆదివారం అన్ని వార్డులలో గల దేవతలకు బోనాల సందర్భంగా ఆయా దేవాలయాలలో భక్తులకు సౌకర్యాలు కల్పించాలని పేర్కొన్నారు. 29న బహర్ పేట్, ఎల్బీనగర్ పెద్దమ్మతల్లి బోనాలు, 30న ఇతర దేవతల బోనాలను పురస్కరించుకొని ఆయా దేవాలయాల వద్ద ప్రత్యేక ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి డెలిగేట్ తంగళ్ళపల్లి రవికుమార్, ముదిరాజ్ సంఘం పట్టణ అధ్యక్షులు ఎనబోయిన జహంగీర్, పట్టణ ప్రధాన కార్యదర్శి నీల శ్రీనివాస్, నాయకులు కుక్కదూవ్వ సోమయ్య, ఉడుత భాస్కర్, తుమ్మల నగేష్, పిట్టల బాలరాజ్, పోలిశెట్టి అనిల్ కుమార్ పాల్గొన్నారు.

## ఘనంగా రాజీవ్ గాంధీ జన్మదిన వేడుకలు



**మోత్కూరు, ఆగస్టు 20 ( వార్త వేదిక సూర్య):** భారత దేశ మాజీ ప్రధాని దివంగత రాజీవ్ గాంధీ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని గురువారం స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద ఆయన చిత్రపటానికి పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు గుండగోని రామచంద్రుగౌడ్, రాచకొండ బాలరాజు, మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం స్వప్న సోమనర్సయ్య, పిఎసిఎస్ చైర్మన్ పేలపూడి వెంకటేశ్వర్లు, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శులు అవిశెట్టి అవిలిమల్లు కూరెళ్ళ శ్రీరాములు,, జిల్లా,మండల నాయకులు గుర్రం లక్ష్మీనర్సింహ్మారెడ్డి మందుల సురేష్, ముద్దం జయశ్రీ, అన్నెపు పద్మ,బయ్యని రాజు కురిమిళ్ళ రాములు, జి.నర్సింహ్మా అనిల్ తదితరులు పాల్గొన్నారు.

www.vaarthavedhikasurya.com
వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY
సంపుటి : 2, సంచిక : 93 || శుక్రవారం || ఆగస్టు, 21, 2026



# యాదాద్రి భువనగిరి

# నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

- ఎండీ ఇమ్రాన్

**వలిగొండ: ఆగస్టు 20 ( వార్తా వేదిక సూర్య )** కార్మికులకు అండగా ఏఐటీయూసీ నిరంతరం పోరాడుతుందని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఇమ్రాన్ అన్నారు. గురువారం రోజున వలిగొండ మండల కేంద్రంలోని దేవి శ్రీ గార్డెన్స్‌లో ఏఐటీయూసీ మండల 3వ మహాసభ చొప్పరి వెంకటేశం అధ్యక్షతన జరిగింది. మహాసభకు ఇమ్రాన్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు కార్మికుల హక్కులను బలహీనపరిచే విధంగా ఉన్నాయని విమర్శించారు. కార్మికులు ఎన్నో దశాబ్దాల పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులను హరించే ఈ నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు, పని ప్రదేశాల్లో రక్షణ, ఈఎస్ఐ, పీఎఫ్, పెన్షన్ వంటి సామాజిక భద్రతా సౌకర్యాలను పటిష్టంగా అమలు చేయాలని కోరారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానాలను రద్దు చేసి కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం 26,000 ఇవ్వాలని, అందరికి ఈఎస్ఐ పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, భవన నిర్మాణ కార్మికులు, హమాలీలు, ఆటో కార్మికులు, పారిశ్రామిక కార్మికులు, స్కీం వర్కర్లు తదితర అసంఘటిత రంగ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని అన్నారు. కార్మికులపై పెరుగుతున్న పని భారాన్ని తగ్గించి, కనీస వేతనాలను పెంచాలని, ధరల పెరుగుదలకు అనుగుణంగా వేతనాలను సవరించాలని డిమాండ్ చేశారు. కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా అన్ని రంగాల కార్మికులు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఆగస్టు 26న భువనగిరిలోని సుమంగళి ఫంక్షన్ హాల్‌లో జరిగే ఏఐటీయూసీ యాదాద్రి భువనగిరి జిల్లా 3వ మహాసభను జయప్రదం చేయాలని, జిల్లాలోని కార్మికులు, ఏఐటీయూసీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై జిల్లా మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. లిఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి సలిగంజి వీరస్వామి, సహాయ కార్యదర్శి ఎల్లంకి మహేష్,సిపిఐ సీనియర్ నాయకులు ఎలగందుల అంజయ్య, పోలేపాక యాదయ్య , సల్వాదిరి రవీందర్, బొడిగ సుదర్శన్, సుద్దాల సాయికుమార్, ఏఐటియుసి నాయకులు కనకబోయిన ఆంజనేయులు, కందుకూరి సంజీవ,నానంచర్ల వెంకటేష్,ఐలపాక స్వామి, గడ్డల నరసింహ, బొలుగుల రామ్మూర్తి, కసరబోయిన మహేష్ తదితరులు పాల్గొన్నారు.




## ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు



**చౌటుప్పల్ ఆగస్టు 20 వార్తా వేదిక సూర్య :** భారత రత్న, ఆధునిక సాంకేతిక నిర్మాత స్వర్గీయ శ్రీ రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు చౌటుప్పల్ మున్సిపాలిటీ లక్కారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా గురువారం నిర్వహించిడం జరిగింది. ఈ సందర్భంగా స్వర్గీయ రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులు అర్పించి, నాయకులు మాట్లాడుతూ భారత దేశానికి రాజీవ్ గాంధీ సేవలను కొనియాడుతూ, దేశానికి కంప్యూటర్ టెక్నాలజీ వ్యవస్థను అందించి సాంకేతిక విప్లవానికి నాంది పలికాడనీ, 18సంవత్సరాలకే ఓటు హక్కు కల్పించడా నీ దేశ సమానత్వం కోసం ప్రాణ త్యాగం చేశాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య ,వైస్ చైర్మన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆకుల ఇంద్రసేనారెడ్డి , మండల ఉ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బోయ దేవేందర్, కాసర్ల శ్రీనివాస్ రెడ్డి సర్పంచ్ తిగుళ్ళ చంద్రయ్య, కో ఆప్షన్ మెంబర్లు బాబా షరీఫ్, పస్తం గంగారాం, దేవాలయ చైర్మన్ బొబ్బిల్లా మురళి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు డిల్లీ చంద్రకళ, పబ్బు శ్రీకాంత్, బోయ వెంకటే, చిమ్ముల వెంకట్ రెడ్డి, శంకర్ నాయక్, మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బక్క శ్రీనాథ్,బత్తుల శ్రీహరి, షాది ఖాన చైర్మన్ ఎం డి కరీం, ఆవుల యేసు, లచ్చునాయక,బండమీద వెంకటేశం,తోరుపూనూరి శ్రీకాంత్, కడగంచి జనార్ధన్, పాశం కృష్ణ, కొండె నరసింహ, ఉదరీ రమేష్, నరసింహ చారి, తదితరులు పాల్గొన్నారు.

## సాగునీటి ప్రాజెక్టుల కోసం సిపిఎం చేపట్టిన పాదయాత్ర విజయవంతం చేయండి



**మోత్కూరు, ఆగస్టు 20 ( వార్త వేదిక సూర్య):** జిల్లాలోని పెండింగ్ లో ప్రాజెక్ట్ లకు నిధులు విడుదల చేయడంతో పాటు ఆయా ప్రాజెక్టులు పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 29,30,31,తేదీలలో సిపిఎం పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టే పాదయాత్రను విజయవంతం చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బొల్లు యాదగిరి పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ఇందుకు సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి నల్లగొండ జిల్లా నుండి 2016 లో యాదాద్రి భువనగిరి జిల్లా నూతనంగా ఏర్పడి దశాబ్ద కాలం గడచినప్పటికీ జిల్లాలో ఇప్పటివరకు ఏ ఒక్క సాగునీటి ప్రాజెక్ట్ పురోగతి సాధించలేదని ఆవేదన వ్యక్తం చేశారు.. జిల్లాకు వ్యవసాయమే ప్రధాన జీవనాదారంగా లక్షలాది మంది చిన్న సన్న కారు మధ్యతరగతి రైతాంగం వ్యవసాయంపై ఆధారపడి తమ కుటుంబాలను పోషించుకుంటున్నారని తెలిపారు. ఆత్మకూరు (ఎం) మోత్కూరు, అడ్డగూడూరు ర్మండలాలకు సాగు త్రాగు నిరంధించే బునాదిగాని కాల్వ పూర్తి చేసి నీరు అందించడంలో పాలక ప్రభుత్వాలు పూర్తిగా విఫమైయ్యాయని విమర్శించారు. సాగునీటి ప్రాజెక్ట్ లకు నిధులు విడుదల చేసి ప్రాజెక్ట్ లను పూర్తి చేయాలని ఈ పాదయాత్రలో భాగంగా 31 న చలో హైద్రాబాద్ ఇందిరా పార్క్ లో జరిగే మహాధర్నా కు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పైళ్ల యాదిరెడ్డి, సిపిఎం సీనియర్ నాయకులు కూరపాటి రాములు, ఎన్నం వెంకట్ రెడ్డి, మండల కమిటీ సభ్యులు పానుగుల రమేష్, అరిగే బుచ్చయ్య, నరిగే రాములు, తదితరులు పాల్గొన్నారు.

## గాంధీనగర్‌లో విద్యుత్ సమస్యకు పరిష్కారం

- నూతన డీటీఆర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



**మోత్కూరు, ఆగస్టు 20 ( వార్త వేదిక సూర్య):** మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డు గాంధీనగర్‌లో తరచూ ఏర్పడుతున్న విద్యుత్ హెచ్చుతగ్గుల సమస్యకు పరిష్కారం లభించింది. విద్యుత్ హెచ్చుతగ్గుల కారణంగా మోటార్లు, టీవీలు, ఫ్యాన్లు తదితర విద్యుత్ పరికరాలు దెబ్బతింటున్నాయని స్థానికులు కౌన్సిలర్ మెంట రమణ నగేష్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన కౌన్సిలర్ రమణ నరేష్ విద్యుత్ శాఖ , ఉన్నతాధికారులతో మాట్లాడి గాంధీనగర్‌లో నూతన డీటీఆర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయించారు. గురువారం ఆమె ఆధ్వర్యంలో నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు. దీంతో గాంధీనగర్ వాసులకు విద్యుత్ హెచ్చుతగ్గుల సమస్య నుంచి ఉపశమనం కలగనుంది. సమస్యను పరిష్కరించేందుకు చొరవ చూపిన కౌన్సిలర్ రమణ నగేష్ లకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గడ్డం స్వప్న, వైస్ ఛైర్మెన్ పల్లెర్ల వెంకన్న, గుప్తా 11వ,వార్డు కౌన్సిలర్ కారుపోతుల వెంకన్న గౌడ్, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి కూరెళ్ల శ్రీరాములు, యూత్ కాంగ్రెస్ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి మందుల సురేష్, స్థానికులు గడ్డం సోమనర్సయ్య, గనగాని నర్సింహ్మ,,కూరెళ్ళ రాములు,పల్లె బిక్షం, విద్యుత్ శాఖ ఏఈ,అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వపాఠశాలలో కొనసాగుతున్న అడ్మిషన్లు

- 161 అంకెల ఆకారంతో కూర్చున్న విద్యార్థులు



**మోత్కూరు, ఆగస్టు 20 ( వార్త వేదిక సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లాలో మోత్కూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అడ్మిషన్ల సంఖ్య రోజురోజుకు పెరుగుతుంది. పాఠశాల ప్రారంభమై రెండు నెలలు దాటిన ప్రైవేట్ పాఠశాలను అధిక ఫీజులను ఒత్తిడికి లోనై వివిధ పాఠశాలల నుంచి అడ్మిషన్ సంఖ్య పరంపరంగా కొనసాగుతుంది. గత ఏడాది (2025బిబి26 విద్యాసంవత్సరానికి) పదవ తరగతి ఫలితాలలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన ఈ పాఠశాల పనితీరుపై జిల్లా ఉన్నతాధికారులు ప్రశంసల జల్లులు కురిపిస్తున్నారు. గురువారం నాటికి 161 అడ్మిషన్ సంఖ్య చేరుకోవడంతో ఆ పాఠశాల యాజమాన్యం 161 సంఖ్యను అనుసరించి విద్యార్థులను అదే ఆకారంలో కూర్చోబెట్టారు. గతఏడాది పదవ తరగతి అత్యుత్తమ ఫలితాలు సాధించడంతోపాటు పదిమంది డి.ఆర్.డి. ఏ .ఒకరు ట్రిబుల్ ఐటీ కి ఎంపికయ్యారని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు దేవినేని అరవిందరాయుడు గురువారం "తెలుగు ప్రభ"ప్రతినిధి తో తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్, మధ్యాహ్నం భోజనం సదుపాయం రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందన్నారు. పాఠశాలలో విశాలమైన క్రీడా మైదానం నైపుణ్యమైన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని పేర్కొన్నారు. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్ సంఖ్య మోత్కూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ముందంజలో ఉందని తెలిపారు.తమపై నమ్మకంతో పాఠశాలకు పంపిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెడతామని పేర్కొన్నారు.

## మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి



**వలిగొండ: ఆగస్టు 20 ( వార్తా వేదిక సూర్య ) :** మాజీ ప్రధానమంత్రి భారతరత్న ఆధునిక భారత నిర్మాత స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను వలిగొండ పట్టణ కేంద్రంలో గురువారం వలిగొండ మండల, పట్టణ,కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బత్తిని సహదేవ్ గౌడ్, పోలేపాక జానకి రాములు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ దేశంలో శాంతి సౌభ్రాతృత్వం, మతసామరస్యం,ఐక్యతను పెంపొందించాలనే సందేశం తో జరుపుకునే సద్భావన దినోత్సవం ప్రజలందరికీ ఒక గొప్ప స్ఫూర్తిగా నిలుస్తుందని సమైక్యతే మన శక్తి సద్భావమే మన ప్రగతి అనే స్ఫూర్తితో రాజీవ్ గాంధీ ఆశయాలను ఆదర్శంగా తీసుకొని బలమైన భారతదేశ నిర్మాణానికి మన వంతు కృషి చేయాలనిపిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు వాకిటి అనంతరెడ్డి, మాజీ ఎంపీపీ నూతి రమేష్ రాజ్,పబ్బు సురేందర్, ఐటిపాముల రవీంద్ర,కొండూరు భాస్కర్, రేఖల ప్రభాకర్, బద్దం సంజీవరెడ్డి, రేసు బుచ్చిరెడ్డి, చిలుగూరి సత్తిరెడ్డి, ఉలిపే మల్లేశం,కాసుల వెంకన్న, కొండూరు సాయి,బత్తిని వరుణ్ గౌడ్, ఆదిమూలం సోమేష్ ,రాపోలు శ్రీనివాస్,దండ మల్లికార్జున్, రాచమల్ల తిరుపతయ్య, మైసొల్ల యాదగిరి, ఎండి షర్ఫోద్దిన్,తదితర కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## 26న భువనగిరిలో జరిగే ఏఐటీయూసీ జిల్లా మహాసభను జయప్రదం చేయండి

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఇమ్రాన్. .

**మోత్కూరు, ఆగస్టు 20 ( వార్త వేదిక సూర్య):** కార్మికుల హక్కుల సాధన, వాటి పరిరక్షణ కోసం పోరాటమే ఏఐటీయూసీ ప్రధాన లక్ష్యమని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.డి ఇమ్రాన్ అన్నారు. గురువారం మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని కేఆర్ భవన్‌లో ఏఐటీయూసీ మోత్కూరు 3వ మండల మహాసభ పురుగుల రవి అధ్యక్షతన నిర్వహించారు. ఈ మహాసభకు ముఖ్యఅతిథిగా ఇమ్రాన్ హాజరై మాట్లాడుతూ కేంద్ర--రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, కార్మికులకు కనీస వేతనం నెలకు 26,000 ఇవ్వాలని, ఉద్యోగ భద్రత, ఈఎస్ఐ, పీఎఫ్, పెన్షన్, సామాజిక భద్రత వంటి హక్కులను కల్పించడంతో పాటు కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానాలను రద్దు చేసి కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఐక్యంగా పోరాటాలను మరింత ఉధృతం చేయాల్సిన అవసరం ఏర్పడిందన్నారు.

ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి అన్నెపు వెంకట్, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు బుషిపాక నర్సింహ్మ, ఏఐటీయూసీ మండల కార్యదర్శి జంగ నర్సయ్య, మండల నాయకులు మొగుళ్ళ శేఖర్ రెడ్డి, పెండెం వెంకటేశ్వర్లు, నోముల రమేష్ నేత, ఎండీ పాషా,తాడూరిలక్ష్మి నర్సయ్య, బోడ సోమనర్సయ్య, బొడ్డుపల్లి లక్ష్మయ్య,ఎడ్ల ఆనంద్, ఎండీ జానీ,సాదిక్, రాపోలు రాజు, సమీర్ నాగరాజు, యాదగిరి, జంగ లింగం తదితరులు పాల్గొన్నారు.




## రాష్ట్ర అధ్యక్షులు విరహత్ అలీకి జిల్లా నాయకుల పరామర్శ

**భువనగిరి టౌన్ ఆగస్ట్ 20, వార్త వేదిక సూర్య** యాదాద్రి భువనగిరి: టియుడబ్ల్యూజే (ఐజేయు) రాష్ట్ర అధ్యక్షులు విరహత్ అలీ తల్లి బషారత్ ఉన్నిసా బేగం అనారోగ్యంతో మృతి చెందారు. ఈ నేపథ్యంలో సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో గురువారం విరహత్ అలీని యాదాద్రి భువనగిరి జిల్లా టియుడబ్ల్యూజే (ఐజేయు) నాయకులు కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బషారత్ ఉన్నిసా బేగం మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ అశ్రునివాళులు అర్పించారు. మాతృమూర్తి మృతి కుటుంబానికి తీరని లోటని, వారి ఆత్మకు శాంతి చేకూరాలని నాయకులు ప్రార్థించారు. పరామర్శించిన వారిలో టియుడబ్ల్యూజే (ఐజేయు) జాతీయ కౌన్సిల్ సభ్యులు జీవి శ్రీనివాస్, ఎలిమినేటి ఇంద్రారెడ్డి, యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు యంబ నరసింహులు, జిల్లా ప్రధాన కార్యదర్శి పోతంశెట్టి కరుణాకర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వెలిమినేటి జహంగీర్, జిల్లా నాయకులు కందుకూరి సోమయ్య, పట్టణ మాజీ కార్యదర్శి జమాలుద్దీన్ తదితరులు ఉన్నారు.

## విద్యార్థుల హాజరు శాతాన్ని మెరుగు పర్చాలి



**మోత్కూరు, ఆగస్టు 20 ( వార్త వేదిక సూర్య):** విద్యార్థుల హాజరు శాతాన్ని పెరుగుపరచాలని మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ ) టి సత్యనారాయణ అన్నారు. గురువారం మండలంలోని దాచారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల అభ్యసన ఫలితాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఎఫ్ ఎల్ ఎన్ కాంపిటెన్సీలో విద్యార్థుల ప్రగతి మెరుగ ఉండాలంటే ఉపాధ్యాయులు తరగతి గదులలో టిఎల్ఎం ను ఉపయోగించి ఆసక్తికరంగా బోధన నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు పగుళ్ల వెంకటేశం, ఎఫ్ ఎల్ ఎన్ సపోర్టింగ్ టీం నోడల్ అధికారి సభ్యులు రవి కిరణ్, వనం వెంకటేశ్వర్లు సత్తిరెడ్డి కాంప్లెక్స్ రిసోర్స్ పర్సన్ వీరవల్లి ప్రవీణ్ కుమార్, సిఆర్పి యాదయ్య మండలంలోని అన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సర్పంచ్ సోమిరెడ్డి బృందం బీఆర్ఎస్ నాయకులు క్యామ మల్లేష్ పరామర్శ



**ఆత్మకూరు (ఎం), ఆగస్టు 20 (వార్తా వేదిక సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండలం స్థానిక నాయకులు పలువురు బీఆర్ఎస్ పార్టీ భువనగిరి పార్లమెంట్ ఇంచార్జ్ క్యామ మల్లేష్‌ను కలిశారు. ఆయన నివాసానికి వెళ్లిన నాయకులు, ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూర్ మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు, లింగరాజుపల్లి గ్రామ సర్పంచ్ ఎర్ర సోమిరెడ్డి, మాజీ సింగిల్ విండో డైరెక్టర్ ఎర్ర అమృత రెడ్డిలతో పాటు అనంతుల నర్సిరెడ్డి, ఎర్ర నరేందర్ రెడ్డి, ఎర్ర నవీన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.







Printed, Published and Owned by **POLOJU SRINIVASA CHARY**, and **Printed at SURYA DIGITAL PRINTERS**, H.No. 1-32, Markondeya Nagar, Choutuppal Municipality, Yadadri-Bhuvanagiri District, Telangana State-508252., and Published at H.No. 1-32, Markondeya Nagar, Choutuppal Municipality, Yadadri-Bhuvanagiri District, Telangana State-508252. **Editor: POLOJU SRINIVASA CHARY. PRGI.NO:- TGTEL/25/A0305,** Cell:9985389183. **EmailId:vaarthavedhikasurya2025@gmail.com**